


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 144 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | గురువారం 29 జనవరి 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE : 144 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | THU 29 JANUARY 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## విశాఖకు ఏఐజీ ఆసుపత్రి..

### పరిశ్రమలకు భూ కేటాయింపులకు మంత్రిమండలి ఆమోదం



- పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు అదనపు నిధులు మంజూరు
- విశాఖలో ఏఐజీ ఆసుపత్రి ఏర్పాటుకు 9 ఎకరాల భూమి కేటాయింపు
- టిడ్కో ఇళ్ల మౌలిక వసతుల కోసం రూ.4,450 కోట్ల రుణానికి ప్రభుత్వ గ్యారెంటీ
- అమరావతిలో వీధిపోటు ప్లాట్ల స్థానంలో వేరేవి ఇచ్చేందుకు రైతులకు అవకాశం
- అంతర్జాతీయ అథ్లెట్ జ్యోతి యర్రాజీకి గ్రూప్-1 ఉద్యోగం, ఇంటి స్థలం

పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. పోలవరం ప్రాజెక్టును వేగవంతం చేయడం, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, పేదలకు గృహ నిర్మాణం

మిగతా 2లో

## చంద్రబాబు ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన జగన్

- రెండేళ్ల చంద్రబాబు పాలన 'జంగల్ రాజ్'లా ఉందని జగన్ విమర్శ
- మద్యం, ఇసుక మాఫియాలతో రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపణ
- టీడీపీ ఎమ్మెల్యేలు మహిళలపై అరాచకాలకు పాల్పడుతున్నా చర్యలు శూన్యమని వ్యాఖ్య
- సంక్రాంతి పండుగను జూదం, అశ్లీల నృత్యాలతో భ్రష్టు పట్టించారని విమర్శ
- మరో ఏడాదిన్నరలో పాదయాత్ర చేపట్టి ప్రభుత్వాన్ని ఎండగడతానన్న జగన్

మిగతా 2లో





## మహారాష్ట్రలో కుప్పకూలిన విమానం

# డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం



### ప్రాణాలు కోల్పోయిన మరో నలుగురు
### ఎన్నికల ప్రచారానికివెళ్తుండగా ఘటన

- సీఎం ఫడ్నవీస్‌కు ప్రధాని మోదీ, అమిత్ షా ఫోన్
- ప్రమాదంలో అజిత్ పవార్ సహా ఐదుగురు మృతి చెందినట్లు డీజీసీఏ ధ్రువీకరణ
- ల్యాండింగ్ సమయంలో అదుపుతప్పి కూలిపోయిన విమానం
- సీఎం ఫడ్నవీస్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా
- స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా జరిగిన దుర్ఘటన

ముంబై: పెన్ పవర్మహారాష్ట్రలో విమానం కుప్పకూం ఘటనలో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ (66) సహా మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం ముంబై నుంచి బారామతి వెళ్తుండగా ఉదయం 8.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

మిగతా 2లో



## ఇది ప్రమాదమే.. కుట్ర కాదు

### అజిత్ మృతిపై శరద్ పవార్ భావోద్వేగం

- విమాన ప్రమాదంలో మహారాష్ట్ర నేత అజిత్ పవార్ దుర్మరణం
- ఇది కేవలం ప్రమాదమేనని, కుట్ర కాదని శరద్ పవార్ స్పష్టీకరణ
- సమర్థుడైన నాయకుడిని కోల్పోయామంటూ భావోద్వేగం
- ఈ విషయాన్ని రాజకీయం చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి

మిగతా 2లో



## ఈ ఒప్పందం ద్వారా భారత్‌దే పైచేయి అవుతుంది

- భారత్-యూరోపియన్ యూనియన్ వాణిజ్య ఒప్పందం.. అమెరికా వాణిజ్య ప్రతినిధి కీలక వ్యాఖ్యలు
- ఈ ఒప్పందానికి సంబంధించిన వివరాలను పరిశీలించాననన్న అమెరికా వాణిజ్య ప్రతినిధి
- దీని వల్ల భారత్‌కే ఎక్కువ ప్రయోజనం ఉంటుందన్న జెమిసన్ గ్రీర్

మిగతా 2లో



## వికసిత్ భారత్‌కు 2026 పునాది సంవత్సరం

- పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్.. ఈ నెల 29న ఆర్థిక సర్వే ప్రవేశపెట్టనున్న నిర్మల

పెన్ పవర్ డెస్క్:పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఢిల్లీలోని పార్లమెంట్‌లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 29న (గురువారం) ఆర్థిక సర్వేను, ఫిబ్రవరి 1న (ఆదివారం) కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ.. గడిచిన ఏడాది వేగవంతమైన ప్రగతి, గొప్ప సాంస్కృతిక వారసత్వానికి గుర్తుగా నిలిచిపోయిందన్నారు. 'వికసిత్ భారత్' నిర్మాణంలో 2026వ సంవత్సరం ఒక కీలకమైన పునాది సంవత్సరంగా

మిగతా 2లో

## జనసేన కాదు.. కామసేన

### ఎమ్మెల్యే శ్రీధర్ వీడియోపై భగ్గుమన్న ఆర్కే రోజా

- జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వీడియో లీక్‌పై రోజా తీవ్ర ఆగ్రహం
- ఇది జనసేన కాదు, కామాంధుల సేన అంటూ తీవ్ర విమర్శలు
- నగరిలో వైసీపీ నేతలతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన
- పవన్, చంద్రబాబు, హోంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
- మహిళల భద్రతలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ



పెన్ పవర్ డెస్క్:జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు సంబంధించిన రాసలీలల వీడియో వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనపై మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది జనసేన కాదని, మహిళల జీవితాలతో ఆడుకుంటున్న 'కామసేన' అని ఆమె తీవ్రంగా ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే శ్రీధర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆమె సొంత నియోజకవర్గమైన నగరిలో వైసీపీ శ్రేణులతో కలిసి భారీ నిరసన చేపట్టారు. ఈ ఆందోళనలో భాగంగా తిరుపతి, చిత్తూరు

మిగతా 2లో

## వెలిగొండపై జగన్‌ది అతిపెద్ద మోసం..

### ఆధారాలతో సహా బయటపెట్టిన మంత్రి నిమ్మల



- వెలిగొండపై జగన్ ప్రభుత్వం ప్రజలను దగా చేసిందన్న మంత్రి నిమ్మల
- పూర్తి కాని ప్రాజెక్టును ఎన్నికల ముందు జాతికి అంకితం చేశారని ఆరోపణ
- టన్నెళ్లు, హెడ్ రెగ్యులేటర్, ఫీడర్ కెనాల్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని వెల్లడి
- రూ.900 కోట్ల నిర్వాసితుల ప్యాకేజీని గత ప్రభుత్వం చెల్లించలేదని విమర్శ
- 2026 నాటికి వెలిగొండను పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టీకరణ

మిగతా 2లో



## రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

- పోర్టుల నుంచి ఇతర రాష్ట్రాలకు రైలు కనెక్టివిటీపై ప్రధానంగా చర్చ
- రాయలసీమ నుంచి కోస్తాకు మెరుగైన రైలు మార్గాలపై దృష్టి
- హై స్పీడ్ రైల్ కారిడార్ల ఏర్పాటు ప్రతిపాదనపై సమావేశంలో సమీక్ష
- విజయవాడ, విశాఖ వంటి జంక్షన్లలో రద్దీ తగ్గించడంపై చర్చ

మిగతా 2లో

## అమెజాన్‌లో 16వేల మంది ఉద్యోగులు తొలగింపు




పెన్ పవర్ డెస్క్:ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి భారీ సంఖ్యలో లేఆఫ్ ప్రకటించింది. గతేడాది అక్టోబర్‌లో 14 వేల మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించగా.. తాజాగా 16వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నట్లు పేర్కొంది.

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## అజరామరాలు వేటూరి గీతాలు

వేటూరి జయంతి తెలుగు పదానికి పునరావృత జన్మదినం. ఆయన గేయ రచనా వైవిధ్యం ఎందరికో స్ఫూర్తి దాయకం. శ్రీశ్రీ తర్వాత జాతీయ అవార్డు అందుకున్న తెలుగు పాటల రచయత వేటూరి సుందర రామమూర్తి. మాతృదేవోభవ సినిమాలోని రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే పాటకు ఈ అవార్డు అందుకున్న వేటూరి. ఇటు క్లాసే కాదు.. అటు మాస్ సాంగ్స్ రాయడంలోనూ వేటూరి వారిది అందె వేసిన చెయ్యే. తొమ్మిది వేలకు పైగా అలవోకగా ధారాపాతంగా పాటలు రాసిన గొప్పతనం వేటూరిది. పల్లెటూరి మాటలైనా, సమాస భూయిష్ట సంక్లిష్ట పదాలైనా పండితుని నుండి పామరుని వరకూ అవలీలగా చేరి, సులభంగా ప్రతీ నోటా పాడుకునేలా చేసిన అసమాన ప్రతిభ ఆయనకే సొంతమైంది. వేటూరి సినిమా పాటలు రాయటానికి పూర్వం కొంతకాలం పత్రికల్లో పని చేసారు. తెలుగు భాష, సాహిత్యాలపై మక్కువ పెంచు కోవడానికి కారణం అయన పెదనాన్న వేటూరి ప్రభాకర శాస్త్రి, తెలుగులో ప్రథమ జ్ఞానపీఠ గ్రహీత కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ. 1960 సంవత్సర ప్రాంతాల్లో మొదట ఆంధ్ర పత్రికలో కాలూని, తర్వాత ఆంధ్రపత్రిక వీక్లీకి సహాయ సంపాదకుడుగా, ఆపై కొంతకాలం ఆంధ్రప్రభ వార పత్రికకు చీఫ్ సబ్ ఎడిటర్ గా అయన పని చేశారు. ఎన్టీఆర్ నటించిన "దీక్ష" సినిమాలో మొదటిసారిగా సినిమాకు గీతరచన ప్రారంభించినా అది సినిమాలో రాలేదు. 1972 సంవత్సరం "ఓ సీత కథ" సినిమాలో లీల పాడిన హరికథతో, సినిమా దర్శకులు కె.విశ్వనాథ్ ప్రోత్సాహంతో సినిమా పాటల రచయితగా శ్రీకారం చుట్టి, వెనుతిరిగి చూడకుండా సాగుతూ, వరసగా సినిమా పాటలు రాస్తూ వచ్చారు. వేటూరిగా పిలవబడే వేటూరి సుందర రామమూర్తి (జనవరి 29, 1936 – మే 22, 2010) లాంటి రచయిత సినీ పరిశ్రమకు పరిచయం కావడం తెలుగు ప్రజలు చేసుకున్న పురాకృత సుకృతం. సుందర రామమూర్తి 1936 జనవరి 29 న కృష్ణా జిల్లా, మోపిదేవి మండలం పెదకళ్ళేపల్లిలో జన్మించారు. మద్రాసులోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్మీడియట్, బెజవాడలో డిగ్రీ పూర్తి చేశారు. 1956 నుంచి పదహారేళ్ళ పాటు పాత్రికేయ వృత్తిలో ఉన్నారు. ముందుగా దైతా గోపాలం ఆ తర్వాత మల్లాది వద్ద శిష్యరికం చేశారు. వేటూరి సుందర రామ్మూర్తి 8 నంది అవార్డులతో పాటు మొత్తం 14 అవార్డులు, ఒక జాతీయ పురస్కారం అందుకున్నారు. తెలుగు పాటకు శ్రీశ్రీ తర్వాత జాతీయ ఖ్యాతిని ఆర్జించి పెట్టింది వేటూరియే. కేంద్ర ప్రభుతం తెలుగు భాషకు ప్రాచీన భాషా హోదా ఇవ్వనందుకు నిరసనగా తన పాటకు వచ్చిన జాతీయ పురస్కారాన్ని తిరిగి ఇచ్చి, తన మాతృ భాషాభిమానాన్ని చాటిచెప్పిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనది. వేటూరి మొదటి పాట ఓ సీత కథ. చివరి పాట బద్రినాథ్ లోని ఓంకారేశ్వరి పాట. ఆ మధ్యకాలంలో ఆయన వేల పాటలను రాశారు. ఓంకారేశ్వరి పాటలో 108 వైష్ణవ దివ్య స్థలాలను తన పాటలో వ్యక్త పరిచిన తీరు అసమానం. అపూర్వం, మహాద్భుతం. సంప్రదాయ కవిత్వ పద బంధాల నుండి జానపద గీతాల వరకు అన్నింటిలోనూ తన ప్రతిభను నిరూపించు కున్నారు. కవనంలో, భావంలో, భాషలో పండితుల నుండి పామరుల వరకు అందరిని అలరించిన విశిష్ట శైలి ఈయన సొంతం. వేటూరి సినీ పాటల పరంపర నాలుగు దశాబ్దాలకు పైగా నిరాటంకంగా కొనసాగింది. దర్శకులకు, నిర్మాతలకు, నటీ నటులకు, సినీ సంబంధీకులకు ఆలంబనగా నిలిచింది. శ్రోతల హృదయాలను దోచింది. పసలేని చిత్రాలను పాటల ద్వారా తీరాలకు చేర్చింది. ఒక్క మాటలో ... సినీ పరిశ్రమను అన్ని విధాలా ఆదుకుంది. వేటూరి పాటల పూదోటలో ప్రతీ పాటా పరిమళం కొల్పోని సుగంధ పుష్పాలే. ఎన్నటికీ వాడిపోని అందమైన లతాంతాలే. గానగంధర్వుడు దివంగత ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం మాటల్లో చెప్పాలంటే... 'ఉపనిషత్తుల నుంచి ఉలిపిరి కాయితం వరకూ , దేన్ని గురించైనా అపారమైన పరిజ్ఞానం ' వేటూరిది. మహా కవి శ్రీశ్రీ అన్నట్లు...తాను కన్న, విన్న, అనుభవించిన, ఊహించిన ప్రతి అంశాన్ని పదబద్ధం చేసి, కాదేదీ కవితకు అనర్హం అని నిరూపించిన నేర్పరి వేటూరి. వేటూరి భువి నుండి దివికేగినా, ఆయన పాటలు అజరామరాలు, నిరంతరం తెలుగు వారి నాలుకలపై నడయాడే సుస్వరాలు. తెలుగు ప్రజల మనో ఫలకాలపై చెరగని ముద్రలు వేసి 75 సంవత్సరాల వయస్సులో మే 22, 2010 న హైదరాబాదులో గుండెపోటుతో మరణించారు. తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయారు.

## విశాఖకు ఏఐజీ ఆసుపత్రి..

- మొదటి పేజి తరువాయి

వంటి అంశాలపై కేబినెట్ ప్రధానంగా దృష్టి సారించింది. సమావేశం అనంతరం సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు.

**పోలవరం పూర్తికి అదనపు నిధులు**

వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. డ్యామ్ నిర్మాణానికి అవసరమైన రాయిని సేకరించేందుకు రూ. 247 కోట్లు, లెఫ్ట్ సైడ్ కనెక్టివిటీలో నావిగేషన్ టన్నెల్ నిర్మాణం కోసం రూ. 4.49 కోట్ల అదనపు బడ్జెట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపిందని వివరించారు. డ్యామ్ నిర్మాణానికి 71.63 లక్షల క్యూబిక్ మీటర్ల రాయి అవసరం కాగా, గతంలో తవ్విన రాళ్లలో 50% మాత్రమే నాణ్యంగా ఉన్నాయని, అందువల్ల హిల్ నెం. 902 నుంచి కొత్తగా రాయిని వెలికితీయడానికి ఈ నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ పనులను మెగా ఇంజనీరింగ్ లిమిటెడ్ (వీజు×ూ)కు అప్పగించారు.

**గృహ నిర్మాణం, అమరావతిపై కీలక నిర్ణయాలు**

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) కింద టిడ్కో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతుల కోసం హడ్కో నుంచి రూ. 4,450 కోట్ల రుణం పొందేందుకు ఏపీ టిడ్కోకు ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీని కేబినెట్ రాటిఫై చేసింది. గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని, ఈ ప్రభుత్వం జూన్ నాటికి పెండింగ్ ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి స్పష్టం చేశారు. కొత్తగా ఇళ్ల కోసం వచ్చిన 10 లక్షల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, 2029 నాటికి అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యమని సీఎం ఆదేశించినట్లు తెలిపారు.

అమరావతిలో భూసమీకరణలో భాగంగా ప్లాట్లు పొందిన రైతుల్లో వీధిపోటు, ఇతర వాస్తు సమస్యలు ఉన్న 112 మందికి వేరే ప్లాట్లు కేటాయించేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అధికారం ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ అవకాశం ఒరిజినల్ అలాటీలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేసింది. అలాగే, రాజధాని ప్రాంతంలో భూమిలేని నిరుపేదలకు ఇచ్చే రూ. 5000 పెన్షన్‌ను, వారి తల్లిదండ్రులు మరణిస్తే మైనర్ పిల్లలకు బదిలీ చేసేందుకు కూడా ఆమోదం లభించింది.

## వికసిత్ భారత్‌కు 2026 పునాది సంవత్సరం

- మొదటి పేజి తరువాయి

నిలుస్తుందని ఆమె అభివర్ణించారు. గత దశాబ్ద కాలంలో భారత్ అన్ని ప్రధాన రంగాలలో తన పునాదులను పటిష్ఠం చేసుకుందని, భవిష్యత్ వృద్ధికి బలమైన మార్గాన్ని నిర్మించుకుందని పేర్కొన్నారు. బంకించంద్ర ఛటర్జీ రచించిన 'వందేమాతరం' గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న వేడుకలను ఆమె గుర్తుచేశారు. శ్రీ గురు తేజ్ బహదూర్ జీ 350వ షహీదీ దివస్, బిర్సా ముండా, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను ప్రస్తావించారు. దేశం తన పూర్వీకుల సేవలను గౌరవించుకున్నప్పుడు, యువతరంలో స్ఫూర్తి రగులుతుందని, అది అభివృద్ధి చెందిన భారత్ దిశగా దేశ ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందని రాష్ట్రపతి తెలిపారు. కాగా, సమావేశాలకు ముందు మంగళవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరిస్తామని నేతలు హామీ ఇచ్చారు. ఓట్ల దొంగతనం ఆరోపణలు, ఓటర్ల జాబితా సవరణ, ధాన్యం సేకరణ, ఉపాధి హామీ పథకం వంటి ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తామని కాంగ్రెస్ పార్టీ ఈ సమావేశంలో తెలిపింది.

# మహారాష్ట్రలో కుప్పకూలిన విమానం
# డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం

- మొదటి పేజి తరువాయి

సాంకేతిక లోపం కారణం గానే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోం ది. ముంబై నుంచి బయల్దేరిన గంట తర్వాత విమానంలో సమస్య తలెత్తింది. ఎమర్జెన్సీ ల్యాండింగ్ సమయంలో విమానం అదుపుతప్పి కూలిపోయింది. ఆ వెంటనే భారీగా మంటలు చెలరేగాయి. ప్రమాద తీవ్రతకు విమానం రెండు ముక్కలైనట్లు సమాచారం. విమాన ప్రమాదం పై డీజీసీఏ స్పందించింది. విమానంలో ఎవరూ బతికి లేరని వెల్లడించింది. అజిత్ పవార్, ఇద్దరు వ్యక్తిగత సిబ్బంది, ఇద్దరు విమాన సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. అజిత్ పవార్ 1959 జులై 22న జన్మించారు. ఆయన తండ్రి అనంత్రావ్ పవార్.. మహారాష్ట్ర మాజీ సీఎం శరద్ పవార్కు సోదరుడు. బాబాయి

శరద్ పవార్ అడుగుజాడల్లో రాజకీయాల్లో కి అడుగుపెట్టిన అజిత్పవార్.. 1982లో తొలిసారి కార్పొరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ బోర్డుకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత 16 ఏళ్ల పాటు పుణె జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మ న్గా వ్యవహరించారు. 1991లో తొలిసారి బారామతి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి లోక్సభకు ఎన్నికయ్యారు. అనంతరం శరద్ పవార్ కోసం ఆ సీటును త్యాగం చేసి.. రాష్ట్ర రా జకీయాల్లోకి వచ్చారు. 1991 ఉప ఎన్నికల్లో బారామతి అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొం దారు. ఈ నియోజకవర్గం నుంచి ఏడుసార్లు మహారాష్ట్ర ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు.

## వెలిగొండపై జగన్‌ది అతిపెద్ద మోసం..

గత వైసీపీ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు విషయంలో ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలను ఘోరంగా మోసం చేసిందని, పనులు పూర్తికాకుండానే ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించి 'క్రెడిట్ చోరీ'కి పాల్పడిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల నిర్లక్ష్యాన్ని, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న పనుల పురోగతిని గణాంకాలు, ఫొటోలతో సహా వివరించారు. 2026 నాటికి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశంలో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.

గత మార్చి 6న, ఎన్నికలకు ముందు, నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారని, కానీ ఆ రోజుకు ప్రాజెక్టులో కీలకమైన పనులన్నీ అసంపూర్తిగానే ఉన్నాయని నిమ్మల ఆరోపించారు. "ప్రాజెక్టు పూర్తయితే పండగ వాతావరణం ఉండాలి. కానీ, ఆనాడు 144 సెక్షన్ పెట్టి, రైతు నాయకులను, నిర్వాసితులను హౌస్ అరెస్టులు చేసి పోలీసు పహారా మధ్య ప్రారంభోత్సవం చేయడం, జగన్ ప్రభుత్వ మోసానికి నిలువెత్తు నిదర్శనం" అని ఆయన విమర్శించారు.

**పూర్తి కాని పనులు.. ప్రమాదకర స్థితి**

మంత్రి నిమ్మల ప్రాజెక్టులోని ప్రతి దశలోనూ వైసీపీ ప్రభుత్వం వదిలేసిన పనులను వివరంగా తెలియజేశారు.

హెడ్ రెగ్యులేటర్: శ్రీశైలం నుంచి నీటిని టన్నెల్‌లోకి మళ్లించే హెడ్ రెగ్యులేటర్ వద్ద 4,300 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని మిగిలి ఉండగానే ప్రాజెక్టును ప్రారంభించారని తెలిపారు. దానికి రక్షణగా ఉండే వింగ్స్, రిటర్న్ నిర్మించకపోవడంతో నీటిని వదిలితే మొత్తం నిర్మాణం కూలిపోయే ప్రమాదం ఉండేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు చెప్పారు.

టన్నెల్ 1 & 2: టన్నెల్ 1లో 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించాల్సి ఉందని, టన్నెల్ 2లో దాదాపు 7 కిలోమీటర్ల లైనింగ్, 4,924 మీటర్ల బెంచింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. "లైనింగ్ చేయకుండా నీటిని వదిలితే సొరంగం కూలిపోయే ప్రమాదం ఉంది. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 702 మీటర్ల లైనింగ్ చేస్తే, మేము 18 నెలల్లోనే 3,708 మీటర్ల పని పూర్తి చేశాం" అని ఆయన పోల్చి చెప్పారు.టన్నెల్ బోరింగ్ మెషిన్ (ఁదీవీ): టన్నెల్ 2లో 11వ కిలోమీటరు వద్ద 600 అడుగుల పొడవైన భారీ టన్నెల్ బోరింగ్ మెషిన్ (ఁదీవీ) చిక్కుకుపోయిందని, అది నీటి ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకుంటుందని తెలిపారు. దాన్ని తొలగించకుండా హైకోర్టు ఇచ్చిన స్టేను వెకేట్ చేయించడానికి కూడా గత ప్రభుత్వం ప్రయత్నించలేదని ఆరోపించారు.

ఫీడర్ కెనాల్, నిర్వాసితులు: 11,500 క్యూసెక్కుల నీటిని తట్టుకోవాల్సిన 21 కిలోమీటర్ల ఫీడర్ కెనాల్, చిన్నపాటి వర్షానికే గండ్లు పడిన దారుణ స్థితిలో ఉందని ఫోటోలు చూపించారు. ఇప్పుడు రూ.456 కోట్లతో ఈ పనులను ప్రారంభించామని తెలిపారు. అత్యంత ముఖ్యంగా, ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ఇవ్వాల్సిన రూ.900 కోట్ల ఆర్&ఆర్ ప్యాకేజీని గత ప్రభుత్వం చెల్లించలేదని, పునరావాస కాలనీల నిర్మాణం చేపట్టలేదని మండిపడ్డారు.

**పదేపదే తప్పుడు తేదీలు**

జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు 2020 నుంచి 2023 వరకు నాలుగుసార్లు వేర్వేరు తేదీల్లో ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పి, చివరకు ఏ పనీ చేయకుండా ఎన్నికల ముందు ప్రారంభోత్సవ నాటకమాడారని నిమ్మల విమర్శించారు. పూర్తికాని ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కావాలని వైకాపా ఎమ్మెల్యేలే అడగడం వారి మోసానికి సాక్ష్యమని అన్నారు. హంద్రీనీవా తరహాలోనే, వెలిగొండను కూడా 2026 నాటికి పూర్తి చేసి ప్రకాశం జిల్లా రైతుల దశాబ్దాల కలను నిజం చేస్తామని మంత్రి రామానాయుడు భరోసా ఇచ్చారు.

## చంద్రబాబు ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన జగన్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భీమవరం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గడిచిన రెండేళ్ల పాలనలో రాష్ట్రంలో 'జంగల్ రాజ్' నడుస్తోందని, 'దోచుకో, పంచుకో, తినుకో' అనే రీతిలో పాలన సాగుతోందని ఘాటుగా విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలన్నీ అబద్ధాలేనని తేలిపోయిందని అన్నారు."చంద్రబాబు ప్రభుత్వం వచ్చి రెండేళ్లు కావస్తోంది. ఈ రెండేళ్లలో రైతులు, మహిళలు, యువత సహా ఏ ఒక్క వర్గానికైనా మంచి జరిగిందా? మా ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలన్నీ రద్దు చేశారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి ప్రతి హామీని నెరవేర్చిన పాలన మాది. కానీ ఇప్పుడు హామీలను మోసపూరితంగా గాలికొదిలేశారు. ఎన్నికలప్పుడు బాండ్లు పంచిపెట్టి ప్రజలను దగా చేశారు. ఇలాంటి మోసాలు చేసే వారిపై 420 కేసులు పెడతారు. కానీ చంద్రబాబు, ఆయన కూటమి నేతలు మాత్రం బయట తిరుగుతున్నారు," అని జగన్ విమర్శించారు.రాష్ట్రంలో విచ్చలవిడి అవినీతి రాజ్యమేలుతోందని జగన్ ఆరోపించారు. "మద్యం వ్యాపారం మొత్తం మాఫియా చేతుల్లోకి వెళ్లింది. ప్రైవేట్ షాపులన్నీ వాళ్ల మనుషులకే ఇచ్చారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను వేలం పెట్టి మరీ అమ్ముకుంటున్నారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు అమ్ముతూ, పర్మిట్ రూమ్‌లు నడుపుతూ, కల్తీ మద్యం అమ్ముతూ ప్రజల రక్తం తాగుతున్నారు. ఇసుక మా హయాంలో ప్రభుత్వానికి ఏటా రూ.750 కోట్లు ఆదాయం తెచ్చిపెడితే, ఇప్పుడు ఫ్రీ అని చెప్పి అక్రమంగా తవ్వేస్తూ రెట్టింపు ధరకు అమ్ముతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు," అని జగన్ ఆరోపించారు.సంక్రాంతి పండుగను జూదం, అశ్లీల నృత్యాలతో భ్రష్టు పట్టించారని, ఇది జంగల్ రాజ్ కాకపోతే మరేమిటని ఆయన ప్రశ్నించారు. "రోడ్లపై రికార్డింగ్ డ్యాన్సులు, మొబైల్ వ్యాన్లలో మద్యం అమ్మకాలు జరిపారు. ఈ అరాచకాల కోసం నియోజకవర్గాల్లో వేలం పాటలు నిర్వహించారు. 'ఊపేయ్, కుదిపేయ్' అంటూ యూనిఫామ్‌లో ఉన్న డీఎస్పీనే ప్రోత్సహించడం సిగ్గుచేటు," అని మండిపడ్డారు.టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు మహిళలపై అరాచకాలకు పాల్పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జగన్ ఆరోపించారు. "కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఒక ప్రభుత్వ ఉద్యోగినిని రేప్ చేస్తే, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వేధింపులతో ఒక ప్రిన్సిపాల్ ఆత్మహత్యాయత్నం చేస్తే చర్యలు లేవు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మంత్రి సంధ్యారాణి పీఏ, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్‌లపై తీవ్ర ఆరోపణలు వచ్చినా పట్టించుకోలేదు. స్వయంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ అశ్లీల నృత్యాలు చేస్తూ చిందులేస్తున్నారు. చంద్రబాబు, ఆయన కుమారుడే వీరందరినీ ప్రోత్సహిస్తున్నారు," అని జగన్ ఆరోపించారు.ఇంకో ఏడాదిన్నరలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని, సుమారు 150కి పైగా నియోజకవర్గాల్లో పర్యటించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతానని జగన్ ప్రకటించారు. "కళ్లు తెరిచి మూసేలోగా మూడేళ్లు గడిచిపోతాయి. నా పాదయాత్ర మొదలైతే ప్రజల్లోనే ఉంటాను. చంద్రబాబు ప్రభుత్వ అన్యాయాలను ప్రతి ఇంట్లోనూ చర్చ జరిగేలా చేయాలి. కార్యకర్తలు సంఘటితంగా ఉండి, అనుబంధ విభాగాలను బలోపేతం చేయాలి. జగన్ 2.0లో కార్యకర్తలకే ప్రథమ స్థానం ఉంటుంది," అని ఆయన భరోసా ఇచ్చారు.

## రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే ప్రాజెక్టుల పురోగతి, కొత్త మార్గాల ఏర్పాటుపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. సచివాలయంలో దక్షిణ మధ్య, తూర్పు కోస్తా, దక్షిణ కోస్తా రైల్వే డివిజన్ల జనరల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో రైలు కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రాష్ట్రంలోని వివిధ పోర్టుల నుంచి తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని హింటర్ ల్యాండ్‌కు సరుకు రవాణాను పెంచేందుకు అవసరమైన రైలు అనుసంధానంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. అలాగే, రాయలసీమ ప్రాంతాల నుంచి కోస్తాంధ్రలోని వివిధ ప్రాంతాలకు కనెక్టివిటీని మెరుగుపరిచే అంశాలపైనా సమీక్షించారు.విశాఖపట్నం, విజయవాడ, గుంతకల్, గుంటూరు,

రేణిగుంట వంటి ప్రధాన జంక్షన్లలో రైళ్ల రద్దీని తగ్గించే మార్గాలపై అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విజయవాడ బైపాస్, భద్రాచలం రోడ్-కొవ్వూరు వంటి కొత్త రైల్వే లైన్ల ప్రతిపాదనల పురోగతిని కూడా సీఎం సమీక్షించారు. గిరిజన ప్రాంతాలకు రైలు సౌకర్యాన్ని విస్తరించడంపై ప్రత్యేకంగా చర్చించారు.

హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు, హైదరాబాద్-బెంగళూరు మార్గాలను హై స్పీడ్ రైల్వే కారిడార్లుగా అభివృద్ధి చేసే ప్రణాళికలపైనా ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రైల్వే నెట్‌వర్క్ విస్తరణ కీలకమని ఈ సందర్భంగా చంద్రబాబు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.

## ఇది ప్రమాదమే.. కుట్ర కాదు

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతి చెందిన ఘటనపై సీనియర్ నాయకుడు శరద్ పవార్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఇది కేవలం ప్రమాదం మాత్రమేనని, దీని వెనుక ఎలాంటి కుట్ర లేదని ఆయన స్పష్టం చేశారు. "అజిత్ పవార్ మరణంతో మహారాష్ట్రకు తీరని నష్టం వాటిల్లింది. ఒక సమర్థుడైన నాయకుడిని ఈ రోజు మనం కోల్పోయాం. ఈ లోటు ఎప్పటికీ పూడ్చలేనిది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు."అన్నీ మన చేతుల్లో ఉండవు. కొన్ని సంఘటనల వెనుక ఎలాంటి రాజకీయం ఉండదు. దయచేసి ఈ విషయాన్ని రాజకీయం చేయవద్దు. ఈ బాధను మహారాష్ట్ర, మనమందరం ఎప్పటికీ భరించాల్సిందే" అని శరద్ పవార్ అన్నారు. కాగా, అజిత్ పవార్ ప్రయాణిస్తున్నది వీఎస్ఆర్ ఏవియేషన్‌కు చెందిన బాంబార్డియర్ లియర్ జెట్- 45 విమానంగా అధికారులు గుర్తించారు. ప్రమాద స్థలంలో దట్టమైన పొగలు కమ్ముకున్న దృశ్యాలు టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యాయి.

## ఈ ఒప్పందం ద్వారా భారత్‌దే పైచేయి అవుతుంది

భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై అమెరికా స్పందించింది. ఈ మేరకు అగ్రరాజ్యం వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కొన్ని వివరాలను పరిశీలించానని, దీని వల్ల భారత్‌కే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని అన్నారు. ఐరోపా మార్కెట్‌లో భారత్‌కు ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. దీంతో ఈ ఒప్పందం ద్వారా భారత్‌ది పైచేయి అవుతుందని అన్నారు.భారతీయ నిపుణులకు ఐరోపా దేశాల్లో ఎక్కువ అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశీయ ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని గుర్తు చేశారు. మా దేశంలోకి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై అధిక టారిఫ్ విధిస్తుండటంతో పలు దేశాలు తమ ఉత్పత్తుల కోసం ఇతర మార్కెట్ల వైపు చూస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈయూ, భారత్ మధ్య ఒప్పందం కుదిరినట్లు వెల్లడించారు.

## అమెజాన్‌లో 16వేల మంది ఉద్యోగులు తొలగింపు

- మొదటి పేజి తరువాయి

ఈ విషయాన్ని సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గలెటీ అధికారికంగా వెల్లడించారు. 2023 తర్వాత ఈ స్థాయిలో ఉద్యోగులను తొలగించడం ఇదే తొలిసారి. అప్పుడు దాదాపు 27వేల మందికి అమెజాన్ లేఆఫ్‌లు ప్రకటించిన విషయం తెలిసిందే.తొలగింపు ప్రక్రియలో భాగంగా.. కార్పొరేట్ ఉద్యోగుల స్థానంలో జనరేటివ్ ఏఐను వినియోగించే యోచనలో ఉన్నట్లు అమెజాన్ పేర్కొంది. కరోనా సమయంలో తీసుకున్న ఉద్యోగుల సంఖ్యలో భారీగా కోత విధిస్తున్నట్లు తెలిపింది. పలు విభాగాలను తగ్గించి, భాగస్వామ్యం పెంచడం, పాలనా వ్యవస్థలను తొలగించే ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించింది. అయితే, ఏయే విభాగాల్లో ఈ తొలగింపులు ఉంటాయనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.అక్టోబర్‌లో చేపట్టిన సంస్థాగత మార్పులు పూర్తయ్యాయని వెల్లడించిన గలెటీ.. అంతర్గతంగా కొత్త రోల్ వెతుక్కునేందుకు అమెరికా ఉద్యోగులకు 90 రోజుల గడువు ఇస్తున్నామని చెప్పారు. ఆలోగా కొత్త రోల్‌ను ఎంచుకోని వారికి నిబంధనల ప్రకారం ఇతర ప్రయోజనాలు అందిస్తామన్నారు. ఈ మార్పులు చేస్తూనే వ్యూహాత్మక విభాగాల్లో నియామకాలు కొనసాగిస్తామన్నారు.

## జనసేన కాదు.. కామసేన

- మొదటి పేజి తరువాయి

జిల్లాల వైసీపీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్ప తదితరులతో కలిసి రోజా ఏజేఎస్ కళ్యాణ మండపం నుంచి ఓం శక్తి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికార మదంతో ఒక మహిళా ఉద్యోగిని బెదిరించి, ఆమె జీవితాన్ని నాశనం చేసిన కీచక ఎమ్మెల్యేను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు.

**పవన్, చంద్రబాబు, హోంమంత్రిపై తీవ్ర విమర్శలు**

ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఆడవాళ్లకు అన్యాయం చేస్తే రోమాలు పీకేస్తా, చర్మం ఒలుస్తా అని ఊగిపోయే పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎక్కడ? ఏం చేస్తున్నారు?" అని సూటిగా ప్రశ్నించారు. "గతంలో జానీ మాస్టర్, కిరణ్ రాయల్, వినూత్న వంటి వారు తప్పు చేసినప్పుడే కఠిన చర్యలు తీసుకుని ఉంటే, ఈరోజు మీ ఎమ్మెల్యే శ్రీధర్ ఇంతటి దుశ్చర్యకు పాల్పడేవాడా?" అని నిలదీశారు. వీడియోలో ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, త్రీ-మెన్ కమిటీ వేసి కాలయాపన చేయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీలు, స్పెషల్ ఫ్లైట్ల కోసమే పవన్ రాష్ట్రానికి వస్తారని, ప్రజల కష్టాలను పట్టించుకోరని ఆరోపించారు.

అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనితపైనా రోజా విమర్శల వర్షం కురిపించారు. మహిళా హోంమంత్రి ఉన్నప్పటికీ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, తన సొంత జిల్లా విశాఖలో డ్రగ్స్, గంజాయిని అరికట్టలేని మంత్రి రాష్ట్రాన్ని ఏం కాపాడతారని ఎద్దేవా చేశారు. గతంలో కాల్ మనీ సెక్స్ రాకెట్ అయినా, ఇప్పుడు సొంత పార్టీ, మిత్రపక్ష ఎమ్మెల్యేల అరాచకాలైనా మహిళలను కాపాడటంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని, ఆయనో 'చేతగాని దద్దమ్మ ముఖ్యమంత్రి' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, హోంమంత్రి అనిత తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని రోజా డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళల ఆత్మగౌరవానికి రక్షణ లేదనడానికి ఈ ఘటనే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. వైసీపీ ఆందోళనతో నగరిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.




# పెన్ పవర్

పోలవరం - ఏలూరు

తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి


## పెన్.పవర్.దినపత్రికలో వచ్చిన దివ్యాంగుల వార్తపై స్పందించిన టిడిపి నాయకులు

**-చిన్నారుల సమస్యల పరిష్కారానికి కృషి,బొర్రా నరేష్, కుమార్**

**వి.ఆర్.పురం పెన్.పవర్.జనవరి.జనవరి.28:**మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన దివ్యాంగుల సమస్యలపై రంపచోడవరం ఎమ్మెల్యే,మిర్యాల శిరీష దేవి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బొర్రా నరేష్,కుమార్,టిడిపిపార్టీ మండల నాయకులతో కలిసి దివ్యాంగులైన,మోడెం మహేష్,పిల్లలు స్పందన,మో డెం సంతోష్,లను వారి నివాసంలో కలిసి,ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి,ఓదార్చి,పరామర్శించారు.ఈ సందర్భంగా బొర్రా నరేష్,కుమార్,మాట్లాడుతూ,గొల్లగూడెం గ్రామంలో ఉన్న దివ్యాంగుల సమస్యలను తక్షణమే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి,ఆకుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.మా ప్రభుత్వం మాటతప్పే ప్రభుత్వం కాదని,రాష్ట్రప్రజలకు మంచి పరి పాలన అందించే ప్రభుత్వమని,స్పష్టం చేశారు.రంపచోడ వరం నియోజకవర్గం ప్రజల శ్రేయస్సుకొరకు పాటు పడు తున్న మాఎమ్మెల్యే,మిర్యాల శిరీష దేవి,అంటూ కొనియా డారు.ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావిస్తూ ప్రతి కుటుంబానికి న్యాయం చేయడమే లక్ష్యంగా భావించి, నిరంతరం పనిచేస్తున్న,మా ఎమ్మెల్యే,మిర్యాల శిరీష దేవి,అంటూ కొనియాడారు.దివ్యాంగుల సంక్షేమానికి అవసరమైన అన్ని ప్రభుత్వ పథకాలు వారికి అందేలా పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ముత్యాల రామారావు, మండల తెలుగుదేశం పార్టీ కార్యదర్శి పాయం రామారా వు,టిడిపిమండలనాయకులు మామిడి రాజు,బింగి విష్ణు, వీర్ల శ్రీను,మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోలి సత్తి బాబు,అప్పన్నబాబు,పంచాయతీ కార్యదర్శి ప్రసాద్,తది తరులు పాల్గొన్నారు.

## జిల్లాలో "స్పర్శ" కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమాల ప్రారంభం

**జిల్లా కలెక్టర్ వై. మేఘా స్వరూప్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 28**

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న కుష్టు నివారణ పక్షోత్సవాలు ఈ ఏడాది "స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమం గా జనవరి 30 నుండి ఫిబ్రవరి 13, 2026 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్నట్లు ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై మేఘా స్వరూప్ తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమాలు విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకుని వెళ్ళాలనీ పిలుపు ఇచ్చారు. బుధవారం కలెక్టరేట్ లో ఇంచార్జి జిల్లా కలెక్టర్ మెజిస్ట్రేట్ వై. మేఘా స్వరూప్ వారి సమక్షంలో పోస్టర్ విడుదల అన్ని శాఖల అధికారుల సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ కుష్టు వ్యాధిగ్రస్తులకు చేసిన సేవలను స్మరించుకుంటూ, గాంధీ వర్ధంతి అయిన జనవరి 30వ తేదీ నుండి ఫిబ్రవరి 13వ తేదీ వరకు జరిగే ఈ అవగాహన కార్యక్రమాలను జిల్లా లోని అన్ని గ్రామాలకు విస్తరించేలా చర్యలు తీసుకోవాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.

కుష్టు వ్యాధి పట్ల అపోహలు, వివక్ష పూర్తిగా తొలగించాల్సిన అవసరం ఉందని, వ్యాధిగ్రస్తులను మానవీయ దృక్పథంతో ఆదరించాలని ఆమె కోరారు. కుష్టు వ్యాధి పూర్తిగా నయం చేయగల వ్యాధి అని, ముందస్తుగా గుర్తించి తగిన చికిత్స తీసుకుంటే అంగవైకల్యాన్ని నివారించవచ్చని తెలిపారు.చర్మంపై స్పర్శ లేని మచ్చలు, నొప్పిలేని బొడిపెలు, తిమ్మిర్లు, కంతులు, చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, చేతులుకాళ్లలో స్పర్శ కోల్పోవడం వంటి లక్షణాలు ఎవరిలోనైనా కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని లేదా ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలని సూచించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో



ఎం డి టి మందులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.అనుమానిత లక్షణాలు ఉన్నవారు ఇంటింటి సర్వేకు వచ్చే ఆరోగ్య కార్యకర్తలకు సహకరించి పరీక్షలు చేయించుకోవాలని, చికిత్స విషయంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. నివారించే కుష్టే వ్యాధి" అన్సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ఇందుకు సంబంధించిన ప్రతి ఒక్కరూ నిబద్ధత కలిగి విధులు నిర్వహించాలని వైద్య అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె.వెంకటేశ్వరరావు, డీఎల్ఏటీ ఆఫీసర్ డా. ఎన్. వసుంధర, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె వాసు దేవరావు, ఐ సి డి ఎస్ పిడి టి శ్రీదేవి, వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అల్లూరి టోర్నీ లో విజేత గా నిలిచిన అడ్డతీగల హంటర్స్..



**అడ్డతీగల, పెన్ పవర్, జనవరి28:** అడ్డతీగల మండలంలో ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే భారీ మెగా అల్లూరి సీతారామరాజు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ఘనంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో అన్ని మ్యాచుల్లో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్న అడ్డతీగలకు చెందిన కెప్టెన్. గౌరీశంకర్ నేతృత్వంలోని హంటర్స్ జట్టు ఉత్కంఠభరిత పోరులో రంపచోడవరం బాబీ జట్టుపై నాలుగు పరుగుల తేడాతో గెలుపొందుతూ టైటిల్ ట్రోఫీని కైవసం చేసుకుంది.

విజేతగా నిలిచిన హంటర్స్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.30 వేల నగదు బహుమతి అందజేయగా, రన్నర్స్‌గా నిలిచిన జట్టుకు ట్రోఫీతో పాటు రూ.20 వేల ప్రైజ్ మనీ అందజేశారు.

ఈ టోర్నమెంట్ నిర్వహణకు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ఆధ్వర్యంలో తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్ రూ.50 వేల ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, అవసరమైన సమయంలో పూర్తిస్థాయిలో సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని టోర్నీ నిర్వాహకుడు బీర. బాలయోగి తెలిపారు.

బహుమతి ప్రదాన కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, రామసేతు పరిరక్షణ కమిటీ అధ్యక్షులు, బీజేపీ నాయకులు గోకవరం కు చెందిన కంబాల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టోర్నీ నిర్వాహకులకు, క్రీడాకారుల అవసరార్థం వినియోగించేందుకు రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా సెమీఫైనల్‌లో ఓడిపోయిన జట్లకు రూ.7,500 చొప్పున ప్రైజ్ మనీతో పాటు, వ్యక్తిగత బహుమతులు పొందిన క్రీడాకారులకు వెయ్యి రూపాయల చొప్పున నగదు ప్రోత్సాహం అందించారు.

అలాగే వేటమామిడి బేస్ విద్యాసంస్థల ఫౌండర్ సందీప్ విజేతలకు అందించే ట్రోఫీల నిమిత్తం రూ.20 వేల ఆర్థిక సహాయం చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది అడ్డతీగల యువత అందర్నీ కలుపుకొని నిర్వాహకుడు బీర. బాలయోగి విశేష ప్రాచుర్యం కల్పించడంతో భారీగా విరాళాలు సమకూరాయని తెలిపారు. టోర్నమెంట్ పూర్తయ్యాక తెలుగు యువత అధ్యక్షులు విజయభాస్కర్ అందించిన రూ.50 వేల మొత్తం మిగలడంతో, భవిష్యత్తులో ఈ టోర్నమెంట్ నిర్వహణకు ఉపయోగపడే విధంగా క్రీడాకారుల కమిటీ ఏర్పాటు చేసి స్థానిక బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు బాలయోగి పేర్కొన్నారు.

ఈ నిర్ణయంపై అడ్డతీగల మాజీ క్రీడాకారులు, గ్రామస్తులు నిర్వాహకులను అభినందించారు.

## తాడేపల్లిగూడెంలో జాతీయ రహదారి భద్రత మాస ఉత్సవాల అవగాహన కార్యక్రమం






**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 28,** పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా రవాణా అధికారి ఆదేశాల మేరకు 37వ జాతీయ రహదారి భద్రత మాస ఉత్సవాలు 01-01-2026 నుండి 31-01-2026 వరకు నిర్వహించబడుతున్నాయి.

ఈ మాస ఉత్సవాల్లో భాగంగా తాడేపల్లిగూడెం రవాణా కార్యాలయం పరిధిలోని శశి కళాశాల ప్రాంగణంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ డి. సురేందర్ సింగ్ నాయక్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూలు మరియు కళాశాల విద్యార్థులకు రహదారి భద్రత నియమాలు, వాహనాలు నడిపే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కళాశాల బస్సుల్లో ప్రయాణించే విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే బస్సు డ్రైవర్లు మరియు ఆయాలు విద్యార్థుల సురక్షిత ప్రయాణం కోసం అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. విద్యార్థులు రహదారి నియమాలను పాటించడంతో పాటు, వాటిని తమ తల్లిదండ్రులకు తెలియజేసి రోడ్డు భద్రతపై సమాజంలో అవగాహన పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం మరియు లెక్చరర్లు పాల్గొని తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు.

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు రహదారి భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ డి. సురేందర్ సింగ్ నాయక్ స్పష్టం చేశారు.


01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

క్లాసిఫైడ్ యాడ్స్

కేవలం

యాడ్ 100/-కే

'ఐదు రోజులకు'

'4 సెం.మీ 4 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి'

93948 55244

పదతులు వర్తిస్తాయి


## వివక్షకు తావులేకుండా అర్హులకు పథకాలు అందాలి




- షెడ్యూల్డ్ కులాల సంక్షేమ పథకాల అమలుపై శాఖల వారీగా సమీక్ష
- ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్

**రాజమహేంద్రవరం , పెన్ పవర్, జనవరి 28 :**రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కే.ఎస్. జవహర్ బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రయోజనాలపై శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా చైర్మన్ కే.ఎస్.జవహర్ మాట్లాడుతూ ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా 20 శాతం ప్రజల పట్ల ప్రత్యేక బాధ్యత వహించాల్సి ఉందని, నిబంధనల మేరకు 15 శాతం షెడ్యూల్డ్ కులాలకు అందాల్సిన ప్రయోజనాలు సక్రమంగా అందుతున్నాయా లేదా పర్యవేక్షణ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఇంకా అసమానతలు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, నేటి సమాజంలో రెండు బెంచీలు విధానం కొనసాగుతోందన్న వాస్తవాన్ని గుర్తించామన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా అధికారులు పనిచేస్తూ అర్హత కలిగిన పేద షెడ్యూల్డ్ కుల కుటుంబాలకు చేదోడువాదోడుగా నిలవాలని సూచించారు. పేదల కోసం పనిచేసే సేవాభావన ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు . సంక్షేమ పథకాల అమలులో వివక్ష, సంఘర్షణ చోటు చేసుకుంటున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తూ, కమిషన్ కు విశేష అధికారాలు ఉన్నప్పటికీ అర్హులకు న్యాయం చేయడానికేనని స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో వివిధ దళిత సంఘాల నాయకులు, ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన అనంతరం చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ, ప్రతి జిల్లాలో సమీక్షలు నిర్వహించి దళిత వర్గాల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కార చర్యలు తీసుకుంటామని తెలిపారు. దళితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, సమాన అవకాశాలు, సమాన భావన కల్పించడమే కమిషన్ బాధ్యతగా తీసుకుంటుందని చెప్పారు.

అర్హులకు పథకాలు అందించే ప్రక్రియలో వివక్ష చోటుచేసుకుంటోందని పేర్కొంటూ, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైనఎస్ సి వర్గ ప్రజలకు చేరేలా చూడడమే లక్ష్యమన్నారు. రాజకీయాలకు అతీతంగా పనిచేయాలనే ఉద్దేశంతో ఎస్సీ కమిషన్ చైర్మన్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అప్పగించిన ఈ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తున్నామని, అందరి సహకారం అవసరమని కోరారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు దాటినా రిజర్వేషన్లు ఎందుకన్న ప్రశ్నలు వస్తున్నాయని, కానీ క్షేత్రస్థాయి పర్యటనల్లో ఇంకా వివక్ష వాస్తవంగా ఉందని గ్రహించానన్నారు. పట్టణ ప్రాంతాల్లో కొంత మేర వివక్ష తగ్గినా, గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతోందని పేర్కొన్నారు. తనకు హోదా ఉన్నందున గౌరవం లభిస్తోందని, కానీ తన సామాజిక వర్గంలో పుట్టిన సాధారణ ప్రజలకు తగిన గుర్తింపు, గౌరవం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి శాఖ తమ శాఖల వారీగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వాస్తవ సమాచారాన్ని తెలియజేయాలన్నారు .అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు అందని పథకాలను క్యారీ ఫార్వర్డ్ చేయాలని, వెనరబుల్ ఏరియాలను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రెవెన్యూ పరంగా 32, పోలీసు పరంగా 9 అర్జీలు పరిష్కరించాల్సి ఉండగా, వాటిని సంబంధిత అధికారులకు అందజేసి తగిన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. అవసరమైన అంశాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీకి కూడా సమాచారం ఇచ్చి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఎస్సీ కమిషన్ కార్యదర్శి ఎన్. చిన్న రాముడు మాట్లాడుతూ, కమిషన్‌కు అందిన అర్జీలను శాఖల వారీగా వర్గీకరించి, పరిష్కార ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. అర్హులకు న్యాయం జరిగే వరకు కమిషన్ స్థాయిలో ఫాలోఅప్ కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎస్సీ కమిషన్ సూచించిన మార్గదర్శకాలు, ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని శాఖల ద్వారా తగిన చర్యలు తీసుకుని, షెడ్యూల్డ్ కులాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు మరింత సమర్థవంతంగా జరిగేలా పర్యవేక్షణ చేస్తామని తెలిపారు.జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ మాట్లాడుతూ, ఎస్సీ కమిషన్ సూచనల మేరకు పోలీస్ శాఖకు సంబంధించిన అర్జీలను ప్రాధాన్యతతో పరిశీలించి, వివక్ష, అన్యాయాలకు తావు లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. షెడ్యూల్డ్ కులాల భద్రత, హక్కుల పరిరక్షణకు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందన్నారు.

ఈ సమావేశంలో కార్యదర్శి ఎన్. చిన్న రాముడు, జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, డీఆర్వో టి. సీతా రామమూర్తి, ఎస్డీసీ కె. భాస్కర్ రెడ్డి, ఆర్డీవో రాణి సుస్మిత, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం.డి. ఘయాజుద్దీన్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అక్క దేవతల ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం.





**గోపాలపురం, పెన్ పవర్, జనవరి 28.** మండలంలోని బీమోలు గ్రామ శివారులో కొలువై ఉన్న శ్రీ అక్కదేవతల అమ్మ వార్ల వార్షిక మహోత్సవం గురువారం జరగనుంది. చరిత్ర ప్రసిద్ధిగాంచిన ఈ ఆలయాన్ని గత మూడు వందల సంవత్సరాల కిందట ఆ గ్రామంలో ఉన్న రాజులు నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. గ్రామ శివారులో రెండు కొండల నడుమ నిర్మించిన ఈ ఆలయానికి ఈశాన్య దిక్కున ఒక కోనేరు ఉంటుంది. ఆలయానికి నైరుతి దిక్కున ఆనాటి రాజులకు సంబంధించిన పాట ఉండేదట. ప్రస్తుతం అక్కడ కోట ఉండదు కానీ దానికి సంబంధించిన కోట గట్టు మాత్రం శిథిలమై పోయి ఉంది. వాటిలో నివాసం ఉండే రాజులు తమ కుల దైవం అయిన అక్క దేవతలను దర్శించుకోవడానికి ఆలయానికి వెళ్లేవారట. రాజుల కోట నుండి కొలను కు వెళ్లి అక్కడ పవిత్ర స్నానం చేసి అమ్మవారి ఆలయానికి వెళ్లి దర్శించుకుని పూజలు చేసేవారని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఇదిలా ఉంటే ఈ ఆలయానికి ఒక ప్రత్యేకత ఉంది. ఏకశిలపై చెక్కిన ఏడుగురు అక్క చెల్లెళ్ళు విగ్రహాలు ఉంటాయి. మీరంతా అక్క చెల్లెలు అని ఒక రాత్రి పై చెక్కబడ్డారని తెలుస్తుంది. అలాగే ఈ ఆలయం నుండి తాళ్లపూడి మండలం గజ్జరం గ్రామ శివారులో ఉన్న కోటకు సొరంగ మార్గం ఉందని అక్కడ నుంచి సైతం రాజ వంశీకులు వచ్చి అమ్మవార్లను దర్శించుకుని మళ్లీ సొరంగ మార్గం ద్వారా మాత్రమే వెళ్లేవారట. అయితే ఆ రోజుల్లో ఉత్సవాలు ఐదు రోజులపాటు రేయింబవళ్లు జరుగుతుండేవి. భక్తులు సుదూర ప్రాంతాల నుండి ఎడ్లబండ్లపై అమ్మవార్లను దర్శించుకోవడానికి ఉత్సవాలను తిలకించడానికి వచ్చేవారట. అయితే ఈ ఆలయం గ్రామానికి కాస్త దూరంలో ఉండడం. చుట్టూ కొండలు భారీ వృక్షాలు నిండి ఉంది. నిర్మానుష్యంగా ఆ ప్రదేశం ఉండడంతో దొంగలు దారి కాచి ఆలయానికి వెళ్లే భక్తులపై దాడి చేసి వారి వద్ద ఉన్న వస్తువులను దోచుకునే వారట. దొంగల భయం కారణంగా ఉత్సవాల ప్రాధాన్యత ప్రతి ఏట కాస్త తగ్గుతూ వచ్చిందని తెలియ వచ్చింది. ఈ ఉత్సవాలలో కోడి పందేలు సైతం జోరుగా సాగేవని మేలు జాతి కోడిపుంజులు అక్కడ లభించేయవని తెలుస్తుంది. ఇప్పటికీ బీమోలు కోడిపుంజులు అంటే మేలు జాతికి చెందినవి అని ఇప్పటికీ పలువురు చెబుతూ ఉంటారు. సంక్రాంతి సమయంలో పందెం రాయుళ్లు సుదూర ప్రాంతాల నుండి వచ్చి అధిక మొత్తం హెచ్చించి మరి ఈ గ్రామం నుండి కోడి పుంజులు తీసుకు వెళ్లడం ఆనవాయితీ. ఇది ఇలా ఉంటే ఈ పురాతనమైన ఆలయంలో సుమారు ఐదు అడుగులు ఎత్తు ఉండే విఘ్నేశ్వరుడి శిలా విగ్రహం ఉండేది. గత పది, 15 సంవత్సరాల కిందట గుర్తు తెలియని వ్యక్తులు ఆ విగ్రహాన్ని దొంగలించి కి పోయి దాని స్థానంలో మరో చిన్న గణనాధుని విగ్రహాన్ని ఉంచారు. దీనిని బట్టి చూస్తే ఆ విగ్రహాలకు ఆలయానికి ఎంత చరిత్ర ఉన్నది అనేది అర్థమవుతుంది. ఆలయ గొప్పతనాన్ని తెలుసుకున్న గ్రామస్తులు శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని పునర్ నిర్మించారు. ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలనే సదుద్దేశంతో ప్రతి ఏటా ఒక్కరోజు ఘనంగా ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. రథసప్తమి రోజున అమ్మవారి వార్షిక మహోత్సవం నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పిస్తున్నారు. ఈ ఉత్సవాలకు గ్రామానికి సంబంధించిన బంధువులు స్నేహితులు తో పాటు చుట్టుప్రక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటారు.



# 87.45 లక్షలతో బాలుర పరిశీలన వసతి గృహం



- ఫిబ్రవరి నెలలోపు స్థానిక సంస్థల ఎన్నికలు
- శంకుస్థాపన చేసిన రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల...

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 28:**నేటి సమాజంలో తమ పిల్లలు విద్యాలయాలకు వెళ్లి వస్తున్న నేపథ్యంలో వారి పరిస్థితులను నిరంతరం తల్లితండ్రులు జాగ్రత్తగా గమనించుకోవాలని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. మారుతున్న పరిస్థితులు, మాదక ద్రవ్యాల కారణంగా నేరాలు అధికమవుతున్నాయని, తల్లి తండ్రులు అత్యంత జాగ్రత్తగా పిల్లల్ని పెంచాలని కోరారు. స్థానిక కోటిపల్లి బస్టాండ్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద సుమారు రూ.87 లక్షల 45 వేలతో నిర్మాణం చేయనున్న ప్రభుత్వ బాలుర పరిశీలన గృహానికి బుధవారం భూమి పూజ నిర్వహించి, అనంతరం శంకుస్థాపన చేసారు. రాష్ట్రాన్ని మాదకద్రవ్యాలు, గంజాయి, నేరాల రహితంగా తీర్చిదిద్దడానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు, రవాణాను అరికట్టగలిగామన్నారు. భవిష్యత్తులో వాటిని పూర్తిగా నిరోధించి ప్రజలు ప్రశాంత జీవనం సాగించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చర్యలు చేపడుతున్నారన్నారు. ఈ పరిశీలనా గృహాన్ని ఆరు నెలల్లో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్కు సూచించామన్నారు. బాలల్లో నేర ప్రవత్తిని నిరోధించి కౌన్సిలింగ్ తో మంచి పద్ధతుల్ని అలవాటు చేస్తారన్నారు. దారి తప్పిన పిల్లలు, అనాధలు ఎక్కువగా నేరాల బాట పడుతున్నారని వారందరిని పరిరక్షించడం ద్వారా నేరాల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. తీవ్ర నేరస్థులుగా మారకుండా ఉండేలా వృత్తి శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించే ఈ కేంద్రాలు భవిష్యత్తును కాపాడతాయన్నారు. మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ ను నిర్మిస్తున్నామన్నారు. పిల్లలకు సరైన పాఠాలు నేర్పాలని, నేరాలకు ప్రోత్సహించకుండా అలవాట్లు మార్చాలని సూచించారు. గత ప్రభుత్వ హాయాంలో ఆగిపోయిన భవనాల నిర్మాణం, సీసీ డ్రెయిన్లు, రోడ్లు పూర్తి చేస్తున్నామన్నారు. 2021లో మొదలైన పనులు ఇప్పటికీ పెండింగ్లో ఉన్నాయని గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జలజీవన్ మిషన్ నిధులు మళ్లీ ఇప్పుడు రూ.13 వేల కోట్లు మళ్లీ వచ్చాయన్నారు. గతంలో 27 వేల కోట్లలో 4 వేల కోట్లు మాత్రమే ఉపయోగించి మిగతాది వదిలేసారని ఇంటింటికి ఉచిత నీరు లక్ష్యం విఫలమైందన్నారు. రూరల్లో నీటి కొరత లేకుండా చేస్తామన్నారు. జగన్ పాదయాత్ర చేస్తామని చెబుతున్నారని, ఐదేళ్ల పాలనలో ఏమి సాధించారు? రాజధాని లేకుండా, పోలవరం, రాయలసీమ ప్రాజెక్టులు గండికొట్టారని, పరిశ్రమలు పారిపోయాయిని, శాంతి, భద్రతలు కాపాడలేదని ఎద్దేవా చేసారు. గంజాయి, డ్రగ్స్ కేంద్రంగా మార్చారని.. తిరుమల లో అవినీతి చేశారు. అక్రమ సంపాదనలు, రాజ్యాంగాన్ని కాపాడలేదని ధ్వజమెత్తారు. రైతులకు పంట డబ్బులు, మద్దతు ధరలు ఇవ్వలేదని, లక్ష కోట్ల బాకీలు వదిలి పారిపోయారన్నరని, కేంద్ర నిధులు పక్కదారి పట్టించారన్నారు. విచారణలు జరుగుతున్నాయని, శిక్ష తప్పదని హెచ్చరించారు. సుప్రీం కోర్టు చెప్పినట్టు ఆర్థిక నేరాల్లో వేగంగా విచారణ సాగుతుందన్నారు. రాబోయే పుష్కరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు కుంభమేళా తరహాలో నిర్వహించాలని నిర్ణయించారని, కేంద్రం నుంచి నిధులు వస్తాయన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగితే పుష్కరాలు బాగా నిర్వహించడానికి అవకాశం ఉంటుందన్నారు. రోడ్లు, బైపాస్ రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ మెరుగుపరచాలని, ఆక్రమణలు తొలగించాలన్నారు. నిధులు వృథా కాకుండా శాశ్వత పనులు చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఫిబ్రవరి లోపల చేయాలని, కోర్టు కేసులు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్సటి ప్రసాద్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లకు పండూరి అప్పారావు, దాలిపర్తి వేమన, శీలం గోవింద్, నిమ్మలపూడి గోవింద్, రొంపిచర్ల ఆంతోని, వడ్డీ వరప్రసాద్, గొందేసి మాధవి లత, పిల్ల తనూజ, పత్తి మంగ, వాసిరెడ్డి బాబి, కే.భాస్కర్, బూర దుర్గాంజనేయులు, కొప్పిశెట్టి చిన్ని, నరసింహమూర్తి, ఏడాకుల వెంకటేశ్వరరావు, చలమూరు సత్యనారాయణ, కుంచె హనుమంతరావు, సింగవరపు సత్యనారాయణ, సుబ్బాయమ్మ, కక్కల రమేష్, కుసుమ, బంగారు రాజు, చిట్టిబోయిన శ్రీనివాస్, పీత వంశీ తదితరులు పాల్గొన్నారు.

# మెట్ట ప్రాంతంలో సంచరిస్తున్న పులి-పంజాకు పశువులు బలి





**గోపాలపురం, పెన్ పవర్, జనవరి 28.**మెట్ట ప్రాంతంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు పులి భయంతో పింబోలెత్తిపోతున్నారు. గత కొన్ని రోజులుగా మెట్ట ప్రాంతంలోని కొన్ని గ్రామాలలో పులి సంచరిస్తున్నది. పలుచోట్ల పశువులను తన పంజాతో పట్టుకుని చంపేస్తున్నది. అయితే ఈ పులి శ్రీ గుబ్బల మంగమ్మ అమ్మవారి ఆలయ సమీపంలోని ఆంధ్ర,తెలంగాణ, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల సరిహద్దుల్లోని పాపికొండల దండక అరణ్యం నుండి మెట్ట ప్రాంతానికి వచ్చిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బుట్టాయిగూడెం మండలం అంతర్వేది గూడెంలో పులి యొక్క పాదముద్రలను మొదటిసారిగా అటవీ శాఖ అధికారులు గుర్తించినట్లు సమాచారం . అల్మేరు ప్రాజెక్ట్ దగ్గరలో మూడు రోజులు తిరుగాడింది. నాగం పాలెం, వీరంపాలెం, దొర మామిడి గ్రామాలకు చెందిన పొలాలలో సంచరిస్తూ అక్కడక్కడ అవకాశం దొరికిన చోట ఆవు గేదె లను వేటాడి చంపింది. అయితే పరిస్థితిని గమనించిన స్థానిక గ్రామాల ప్రజలు విషయాన్ని అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వారు స్పందించి నిఘా కెమెరాలను పులి పాదముద్ర ఆధారంగా ఏర్పాటు చేశారు. అలాగే చాకచక్యంగా పట్టుకునేందుకు రెండు చోట్ల బోనులను సైతం పెట్టారు. అక్కడనుండి ముందుకు కదిలిన పులి కొయ్యలగూడెం మండలంలోని దిప్పకాయలపాడు గ్రామ చివరిలోని భీముని అడుగు పరిసర ప్రాంతాల్లో సంచరించింది. అక్కడ అదే గ్రామానికి చెందిన కామినేని ఆనంద్ కు చెందిన ఆవు దూడను గాయపరి మరొకచోట ఆవులు చంపింది. రెండు మూడు రోజులు పరిసర ప్రాంతాలో సంచరిచ్చినట్లు పాదముద్రల ఆధారంగా తెలుసుకున్నారు. బుట్టాయిగూడెం మండలం కోట రామచంద్రపురం గ్రామ పరిధిలోని అమ్మపాలెంలో ఒక గేదెను మట్టుపెట్టింది. అనంతరం గోపాలపురం , కొయ్యలగూడెం మండలాల సరిహద్దుల్లో ఉన్న పామాయిల్ తోటలు అడవులలో సంచరిచ్చింది . ప్రస్తుతం బుట్టాయిగూడెం మండలం లంకపల్లి గ్రామ పరిసరాల్లో ఉన్నట్లు తెలియ వస్తున్నది. అయితే పులి అక్కడ నుండి దండకారణ్యం లోనికి వెళ్ళిపోతుందా? లేక గత ఏడాది మాదిరిగానే పోలవరం గోపాలపురం మండలాల పరిధిలో ఉన్న కొండల్లో తిరుగుతూ మళ్లీ వెనక్కి వస్తుందా అనేది ప్రశ్నార్థకం?. ఇదిలా ఉంటే గత ఏడాది ఇదే రోజుల్లో ఒక పెద్ద పులి గోపాలపురం నియోజకవర్గంలో విచ్చలవిడిగా సంచరించినట్లు పాదముద్రలు ఆధారంగా సంబంధిత శాఖ అధికారులు తెలుసుకున్నారు. నల్లజర్ల, భీమడోలు, కొయ్యలగూడెం మండలాల్లో సంచరించి అనంతరం మాతంగమ్మ మీదుగా గోపాలపురం గ్రామ శివారు పొలాలలో నుండి భీమోలు అటు నుండి చెరుకుమిల్లి శివారు ప్రాంతంలో పొలాలలో సంచరించింది. అనంతరం రాత్రి వేళల్లో ప్రయాణం సాగిస్తూ మళ్లీ అడవుల్లోకి వెళ్లిందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుతం మెట్ట ప్రాంతంలో వర్జీనియా పొగాకు పంటకు సంబంధించిన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వేలాది ఎకరాలలో ఈ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ పంటకు సంబంధించిన పనులు చేయడం కోసం రైతులు, కూలీలు రేయింబవళ్లు తేడా లేకుండా పొలాల్లోకి వెళ్లి పరిస్థితి. ఇటువంటి సమయంలో పులి సంచరిస్తున్న నేపథ్యంలో వారంతా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని వెళుతున్నారు. కొందరైతే పంట పొలాలకు నీళ్లు పెట్టడానికి సైతం వెనకాడుతున్నారు. ఈ నేపథ్యంలో పులి ఈ ప్రాంతాన్ని విడిచి ఎప్పుడు వెళుతుంది అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.ది గ్రూప్ 2 కోసం

# ఘనంగా శ్రీశ్రీశ్రీ వారాహి దేవి పీఠం ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాలు

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న కంబాల శ్రీనివాసరావు





**రాజమహేంద్రవరం, పెన్ పవర్,జనవరి 28:** రాజమండ్రి రూరల్ పరిధిలోని , కొంతమూరు గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ వారాహి దేవి పీఠంలో ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. . ఈ సందర్భంగా ఆజ్ఞా పీఠికతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల జనవరి 26 (సోమవారం) నుండి జనవరి 28 (బుధవారం) వరకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ సుదర్శన యజ్ఞం, హోమాలు, విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించి న్నట్లు సభ్యులు తెలిపారు. జనవరి 28న ప్రత్యేక అభిషేకం, మహా మంగళహారతి కార్యక్రమాలు జరగనున్నాయన్నారు.

ఈ మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవి అనుగ్రహం పొందారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. శాంతి, ఐశ్వర్యం, సమృద్ధి కలగాలని ఆకాంక్షతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలను విజయవంతం ముగిసాయన్నారు. వారాహి దేవి అమ్మవారి పీఠము ప్రథమ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. భక్తుల సమక్షంలో అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ, అమ్మవారి కృపాకటాక్షాలు అందరికీ లభించాలని, ప్రజలందరూ సుఖశాంతులతో, ఐశ్వర్యంతో జీవించాలని ఆకాంక్షించారు. వారాహి దేవి ఆశీస్సులతో ధర్మ పరిరక్షణ బలపడాలని ఆయన అన్నారు.

బిజెపి సర్వ మతాల పార్టీ అని అన్ని పార్టీల కలయిక బీజేపీ అని, హైందవధర్మం కాపాడుకుంటూ,

కష్టాల్లో ఉన్న వారికి అండగా ముందుకు సాగుతున్నామని ఆయన అన్నారు. కోరుకొండ దేవాలయానికి 25 లక్షలు, మహిళలకు రెండు లక్షల రూపులు, 250 కుటుంబాలకు ప్రతినెల పది నుంచి 20 కేజీల బియ్యం మూడు నియోజకవర్గాల పంపిణీ చేస్తున్నమని ఆయన అన్నారు. కాన్సర్ తో బాధ పడుతున్న విద్యార్థికి లక్ష రూపాయలు సహాయం చేసినట్లు ఆయన తెలిపారు. కుల మతాలకతీతంగా ఆలయాలు, ధర్మాలు కాపాడుకోవడం బాధ్యతని ఆయన తెలియజేశారు. ఈ ఆలయానికి లక్ష రూపాయలు విరాళము అందచేసినట్టు ఆయన తెలిపారు.

# నేడు దవలేశ్వరం లో ఉద్యోగ మేళా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 28:** జిల్లా నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో గ్రామీణ నియోజకవర్గంలో ఉద్యోగ మేళాను గురువారం నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తెలిపారు.ఈ ఉద్యోగ మేళా ఉదయం 10.00 గంటల నుండి గవర్నమెంట్ ఐటీఐ కాలేజ్, దవలేశ్వరం లో నిర్వహించారు.ఈ ఉద్యోగ మేళాలో ఎనర్జీ, వేర్ హౌసింగ్, అగ్రో ఇండస్ట్రీ, రైల్వే సపోర్ట్ సర్వీసులు, ట్రాన్స్ పోర్ట్, ఆటోమొబైల్, ఇన్సూరెన్స్, ఫైనాన్స్, బ్యాంకింగ్ రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయి.

ఈ ఉద్యోగ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు కనిష్ఠంగా రూ.10,000 నుండి గరిష్ఠంగా రూ.28,000 వరకు వేతనాలు (కొన్ని రంగాలలో ఇన్సెంటివ్స్ అలవెన్సులతో) అందుతాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫ్లయర్ లో సూచించిన కంపెనీని ఎంపిక చేసుకొని, ముందస్తుగా కింది లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు:

మరిన్ని వివరాల కోసం 7396740041 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

# యువత క్రీడల వైపు మొగ్గు చూపాలి



**జీలుగుమిల్లి ,పెన్ పవర్ , జనవరి 28** ; యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడల వైపు మొగ్గు చూపాలని జీలుగుమిల్లి ఎస్ఐ వి క్రాంతి కుమార్ సూచించారు. బుధవారం పి అంకంపాలెం ఆర్ అండ్ ఆర్ కాలనీ అయిన చీడూరులో గత నాలుగు రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ కు ఫైనల్లో విజయం సాధించిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ క్రీడా పోటీలకు విజయం సాధించిన విజేతలకు జీలుగుమిల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఉద్యోగి కూరం ప్రసాదు ట్రోఫీలను, మెడల్లను బహుకరించారు. ఈ కార్యక్రమంలో చీడూరు గ్రామ సర్పంచ్ ఈ గోపాల్ రెడ్డి, ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి బొరగం బుజ్జి దొర, సుంకర అనిల్ కుమార్ రెడ్డి, యువత పాల్గొన్నారు.

## పెంటపాడు మండలాన్ని జిల్లాలో 10 వ తరగతి పరీక్ష ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణత ప్రథమ స్థానంలో నిలపాలి.



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 28.** 10 వ తరగతి పరీక్ష ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణత పొంది జిల్లాలో పెంటపాడు మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని పెంటపాడు ఎంపీలు కట్టుబోయిన వెంకటలక్ష్మి పిలుపు నిచ్చారు. పెంటపాడు మండల పరిషత్ కార్యాలయం లో బుధవారం మండలం లోని ప్రాథమిక ఉన్నత పాఠశాల ల ప్రధానోపాధ్యాయులు తో ఎంపీపీ వెంకటలక్ష్మి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో వివిధ పాఠశాలలో చదువుతున్న విద్యార్ధులు పురోగతి ని అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 10 తరగతి విద్యార్థులు కి 100 రోజులు కార్యక్రమం విజయవంతం చెయాలన్నారు. ప్రాథమిక స్తాయిలో విద్యార్థులు కి బలమైన పునాది వేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో సమర్థులయిన ఉపాధ్యాయ సిబ్బంది వున్నారని తెలిపారు ప్రైవేట్ పాఠశాలల
కంటే మెరుగైన భోదన తొ పాటు విద్యార్థులు కి అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుంది అన్నారు రానున్న విద్యా సంవత్సరం లో ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులు ప్రవేశాలు పెంచాలన్నారు పాఠశాలలో సమస్యలు శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టి కి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు ఈ కార్యక్రమం లో ఎం డీ ఓ రామ్ ప్రసాద్ ఎం ఈ ఓ లు ఎం శ్రీనివాస్ టీవీ రామకృష్ణ సి ఆర్ పీ లు రాజు వాసు చిట్టమ్మ బాలు.పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యా సిబ్బంది జనసేన నాయకులు కట్టుబోయిన కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

## వ్యాయామ ద్వారా దివ్యాంగుల పిల్లలలో అభివృద్ధిలో మార్పులు సాధించవచ్చు.



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 28.** తాడేపల్లిగూడెం భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో బుధవారం డాక్టర్ అల్లు శ్రీకృష్ణ మహేష్ దివ్యాంగుల పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహించి దివ్యాంగుల పిల్ల తల్లిదండ్రులకు ఫిజియోథెరపీ పై అవగాహన కల్పించి మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతిరోజు ఫిజియోథెరపీ చేయడం ద్వారా దివ్యాంగుల పిల్లల్లో కండరాల సమస్యల తగ్గి ఇతరుల మీద ఆధారపడకుండా తమ పనులు తమ చేసుకోగలుగుతారని తెలిపారు దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ భవిత కేంద్రంలో డాక్టర్ ఫిజియోథెరపీ పై మాకు అవగాహన కల్పించడం ద్వారా మేము ప్రతిరోజు ఇంటి వద్ద మా పిల్లలకు శిక్షణ ఇవ్వడం ద్వారా మంచి మార్పులు వచ్చాయని సమగ్ర శిక్ష వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భావితా కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎం చంద్రకుమారి, ఎస్.కె బాల ఈశ్వరయ్య దివ్యాంగుల పిల్లలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సమర్ధవశీతమైన సేవలు అందించినపుడే ఉద్యోగులు ప్రజలు మన్ననలు పొందుతారు.



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 28.** సమర్ధవశీతమైన సేవలు అందించినపుడే ఉద్యోగులు ప్రజలు మన్ననలు పొందుతారని పెంటపాడు ఎంపీపీ కట్టుబోయిన వెంకటలక్ష్మి పేర్కొన్నారు. పెంటపాడు మండల పరిషత్ కార్యలయం లో బుధవారం కె.పెంటపాడు వేణుగోపాల స్వామి దేవస్థానం ఫిటపర్సన్ కే. చంద్రశేఖర్ జిల్లా ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న సందర్బంగా ఎంపీపీ వెంకటలక్ష్మి ఎం డీ ఓ రాంప్రసాద్ మండల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా జరిగిన సభలో ఎంపీపీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఉద్యోగులు సేవలు ద్వారానే ప్రభుత్వం కి మంచిపేరు వస్తుందని అన్నారు. మండలం లో ప్రతీ ఉద్యోగి బాధ్యత గా పని చేసి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా లో పెంటపాడు మండలం అన్ని శాఖల లో ప్రథమ స్థానం సాదించాలన్నారు.
జిల్లా ఉత్తమ ఉద్యోగి పురస్కారం అందుకున్న చంద్రశేఖర్ ని అభినందించారు. పెంటపాడు మండలాన్ని ప్రగతి పదంలో నడపడానికి కృషి చేస్తున్నాట్లు తెలిపారు ఈ కార్యక్రమం లో ఎం ఈ ఓ లు ఎం శ్రీనివాస్ టివి రామకృష్ణ పోస్ట్ బేసిక్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేష్ జనసేన నాయకులు కట్టుబోయిన కృష్ణ ప్రసాద్ బి జే పీ నాయకులు కుదుళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తాడేపల్లిగూడెంలో వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో భారీ స్థాయిలో వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం.





పెద్దఎత్తున హాజరైన వైఎస్సార్సీపీ శ్రేణులు.

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 28.** పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణంలోని మాగంటి ఫంక్షన్ హాల్ నందు నియోజకవర్గ సమన్వయకర్త వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు, మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, తానేటి వనిత, చెరుకువాడ శ్రీరంగనాధరాజు, నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణంరాజు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, మాజీ ఎమ్మెల్యేలు పుప్పాల వాసుబాబు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యకులు జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ చింతా అనురాధలు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. తొలుతగా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు మాట్లాడుతూ పార్టీ ఓడిపోయిన రెండు సంవత్సరాల నుండి కూడా పూర్తి ప్రక్షాళన జరుగుతుంది అన్నారు. కార్యకర్తల్లో నూతన ఉత్తేజం కనబడుతుందని అన్నారు. ఆనాడు వైయస్ రాజశేఖర్ రెడ్డి గారికి జరిగిన అన్యాయానికి అన్నగా వైఎస్ జగన్మోహన్ రెడ్డికి వెంటనే మనమంతా ఉన్నామని అన్నారు. అధికారం ఉన్న లేకపోయినా జగన్మోహన్ రెడ్డి ఎల్లప్పుడూ ప్రజల పక్షాన పోరాడుతున్నారని గుర్తు చేశారు. పార్టీ కోసం ఎంతోకలంగా కష్టపడుతున్న ప్రతి ఒక్కరిని వైఎస్ జగన్మోహన్ రెడ్డి గుర్తిస్తున్నారని అదేవిధంగా వాళ్ళని ముందుకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. గత ఐదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా పరిపాలన చేసి ప్రజల గుండెల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఒక చెరగనిముద్ర వేసుకున్నామని గుర్తు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతీ కార్యకర్త కష్టపడలని పార్టీ వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం అనేక అబద్ధాలు చెప్పి, అనేక మోసాలు చేసి అధికారంలోకి వచ్చిందని అన్నారు. గత ఇంచార్జ్ కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇప్పటివరకు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని విజయవంతం చేశారని అలాగే ఇకనుండి వడ్డీ రఘురాం నాయుడు కి సపోర్ట్ చేస్తూ పార్టీని మరింత బాగా బ్రతం చేయాలని వైఎస్ఆర్సిపి శ్రేణులను కోరారు. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే శ్రీధర్ ఒక ఒంటరి మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడడం అత్యంత దారుణమన్నారు. ప్రజా ప్రతినిధులు దగ్గరే రక్షణ లేకపోవడం అవమనకరమన్నారు. తిరుపతి లడ్డూలో ఆవు కొవ్వు, పందికొవ్వు, చేప కొవ్వులను కలిపారంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు సైతం మొట్టికాయలు వేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎంతో దారుణమైన అబద్దాలు ఆడి ఆఖరికి ఆ భగవంతుడుని కూడా అవమానించారన్నారు. మోస పూరిత హామీలు చేసి ప్రజలని మోసం చేశారన్నారు. దీనికి చంద్రబాబు, పవన్ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. మాజీ హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ వైసీపీ మాజీ ప్రజాప్రతినిధులు, సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేస్తుందన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని వైసీపీ నాయకులపై కక్ష సాధింపులకు వినియోగిస్తున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను నెరవేర్చకుండా నెరవేర్చినట్లు సక్సెస్ మీట్ లు పెట్టడం విడ్డూరమన్నారు.
మాజీ మంత్రి చెరుకువాడ శ్రీ రంగనాథ రాజు మాట్లాడుతూ కూటమి పాలన రెండేళ్లు పూర్తి కాకుండానే వారికి రాబోయే ఎన్నికల్లో ఓడిపోతామనే భయం కూటమిని వెంటాడుతుందన్నారు. వైఎస్ఆర్సిపి కి మంచి క్యాడర్ ఉంది, శ్రేణులు ప్రజలతో మమేకమై ఉండాలన్నారు. కేడర్ ను పట్టించుకోకపోవడం వల్ల మా వాడు ఓడిపోతాడనే మాట వచ్చిందని వ్యాఖ్యానించారు. నాడు జగన్ పాలనలోనూ నేటి కూటమి పాలనలోనూ కేడర్ నుంచి వినిపిస్తున్న మాట ఇదే అని తెలిపారు. రాజకీయాల్లో ఒకరినొకరు దూషించుకునే పరిస్థితి వచ్చిందన్నారు.
మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటమి చెందిన కూడా మన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలో ఎక్కడా కూడా అధైర్యం లేదన్నారు. మన నాయకుడు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట తప్పకుండా సంక్షేమ పరిపాలన అందించారు కాబట్టే ప్రతీ కార్యకర్త నిరంతరం ప్రజల్లో ధైర్యంగా తిరుగుతున్నారన్నారు. ఈ రోజు ఈ ఆత్మీయ సమావేశానికి వేల సంఖ్యలో కార్యకర్తలు హాజరు అవుతున్నారు అంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంత పటిష్టంగా ఉందొ తెలుస్తోందన్నారు. గ్రామ సచివలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ అంటూ గ్రామలో ఎన్నో సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత మనదన్నారు. ఎన్నో దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఈ కూటమి ప్రభుత్వం రెండేళు పూర్తయిన ఇంతవరకు ఏం హామీలు నెరవేర్చారో సమాధానం చెప్పవలసిన అవసరం ఉందన్నారు. ఈ రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలు కూడా అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. నియోజకవర్గ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ ఈ సమావేశాన్ని చూసి తాడేపల్లిగూడెం నియోజకవర్గ కూటమి గుండెల్లో గుబులు పుడుతుందన్నారు. తాడేపల్లిగూడెం నియోజవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో వర్గాలు ఏమీ లేవని ఉన్నది ఒకటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గమన్నారు. పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్త తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్చార్జ్ అని అన్నారు. గ్రామస్థాయి నుండి పార్టీని మరింత బలోపేతం చేస్తామని, వచ్చే ఎన్నికల్లో తాడేపల్లిగూడెం నియోజవర్గంలో వైఎస్ఆర్సిపి జెండా ఎగరేస్తామన్నారు. మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ సలహాలు సూచనలు తీసుకుని తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. మళ్లీ తిరిగి తాడేపల్లిగూడెంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడం తథ్యం అని తెలిపారు. ఈ సమావేశానికి పెద్దఎత్తున వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు.





## ఖగుండుగొలను లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి గ్రామ సభ తీర్మానం




- ఆక్రమణదారులకు నోటీసులు,
- సర్వే అనంతరం లైసెన్సులు రద్దుకు చర్యలు

**ఏలూరు జనవరి 28 పెన్‌పవర్ :** నిత్యం ట్రాఫిక్ సమస్యలతో సతమత మవుతున్న గుండుగొలను గ్రామంలో సమస్యలు పరిష్కరించడానికి గ్రామ పంచాయితీ గత డిసెంబర్ 26న నిర్వహించిన గ్రామ సభలో ట్రాఫిక్‌సమస్యలు పరిష్కారానికి తీసుకునే చర్యలకు గ్రామ సభ ఆమెదం తెలిపింది. ఈ మేరకు తీర్మానాన్ని గ్రామ పంచాయితీ కార్యదర్శి గ్రామస్థులకు గ్రామ సభలో చదివి వినిపించారు. గ్రామంలో కొత్త వంతెన నుండి దిగువ గ్రామాలకు వెళ్లే ఆర్ అండ్ బి రహదాపై నిభంధనలు అతిక్రమించి, వ్యాపారాలు సాగిస్తున్న 120 మంది వ్యాపారస్తులకు నోటీసులు జారీ అయ్యాయి. గ్రామంలో రహదారిని ఆక్రమంచి ట్రీఫిక్‌కు అవరోధంగా కలిగిస్తున్న వ్యాపారసంస్థలకు, రహదారి ఇరువైపులా సర్వే నిర్వహించి రోడ్ మార్జిన్‌కు మార్కింగ్ చేసి మరోమారు నోటీసులు జారీ చేసి సహకరించని వ్యాపార సంస్థల లైసెన్స్‌లు రద్దు చేయడానికి గ్రామ సభలో ఆమోదం తెలిపింది. దుకాణదారులు వారి వారి స్థలాల్లోనే పార్కింగ్ ఏర్పాటు చేసుకోకుండా రోడ్ మీద వాహనాలను నిలిపివేస్తే వ్యాపార దారుల లైసెన్స్‌లు రద్దుచేస్తామని నోటీసులలో పేర్కొన్నారు. అప్పటికీ ఆక్రమణ దారులలో కదలిక రాకపోతే ఆర్‌అండ్‌బి, రెవిన్యూ ,పోలీసు శాఖ సహకారంతో ఆక్రమణలు తొలగించి ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించడానికి గ్రామ సభ తీర్మానాలు ఆమలు చేయనున్నటు పంచాయితీ అధికారులు తెలియజేస్తున్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## డ్డతీగల ఎన్. ఆర్. జి. సి కార్యాలయంలో వికసిత భారత్, రోజ్గార్ వారాంతరపు సమావేశం...



**అడ్డతీగల, పెన్ పవర్, జనవరి28:** వికసితభారత్, రోజ్గార్ ఆజీవిక మిషన్ ( గ్రామీణ) సిబ్బంది కి బుధవారం వారాంతపు సమావేశని కి అడ్డతీగల ఎంపీడీవో కుమార్ హాజరయ్యారు. పంచాయితీల వారిగ పురోగాతి రీవ్యూ నిర్వహించారు. 100,150,రోజుల పనిదినాలు ఎక్కువ కుటుంబాలకు కల్పించాలని, మండలంలో ఉన్న 99 గ్రామాలలో 22 గ్రామపంచాయితీ లకు లేబర్ సంఖ్య పెంచి,లేబర్ బడ్జెట్ పూర్తిస్తాయి లో పూర్తి చేయాలని ఎంపీడీవో ఆదేశాలు జారీ చేశారు . జనవరి26 రీపబ్లిక్ డే రోజున పోలవరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా, ఉత్తమ పురస్కారం అందుకున్న ఎంపీడీవో కుమార్ కు, ఈ సందర్భంగా వికసిత భారత్ రోజ్గార్ సిబ్బంది గౌరవప్రదంగా శాలువా కప్పి, సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

## తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో నాలుగు బార్ లైసెన్సులకు దరఖాస్తుల ఆహ్వానం



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ । జనవరి 28 :**
పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా నాలుగు బార్ లైసెన్సుల మంజూరుకు జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు డబ్ల్యూ.జీ/బి/పదిహేడు, డబ్ల్యూ.జీ/బి/పందొమ్మిది, డబ్ల్యూ.జీ/బి/ఇరవై, డబ్ల్యూ.జీ/బి/ఇరవై ఒకటి వరుస సంఖ్యలతో ఉన్న బార్లకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు.
నోటిఫికేషన్ ప్రకారం ఫిబ్రవరి నాలుగు, రెండువేల ఇరవై ఆరు సాయంత్రం ఆరు గంటల లోపు అభ్యర్థులు ఆన్‌లైన్ ( ఓసి హెచ్‌పీఎఫ్ఎస్ ప్రాజెక్ట్ డాట్ కామ్) వెబ్‌సైట్ ద్వారా హైబ్రిడ్ లేదా ఆఫ్‌లైన్ విధానాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతి దరఖాస్తుకు తిరిగి చెల్లించబడని అప్లికేషన్ ఫీజుగా రూ. ఐదు లక్షలు, ప్రాసెసింగ్ ఫీజుగా రూ. పది వేలు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.
ఈ బార్ లైసెన్సుల కాలపరిమితి ఐదురెండురెండువేల ఇరవై ఆరు నుంచి ముప్పై ఒకటిఎనిమిదిరెండువేల ఇరవై ఎనిమిది వరకు ఉంటుందని తెలిపారు. రిటైల్ ఎక్సైజ్ పన్ను కింద రెండువేల ఇరవై ఐదుఇరవై ఆరు సంవత్సరానికి రూ. నలభై ఒక లక్షల ఇరవై ఐదు వేల రూపాయలు, రెండువేల ఇరవై ఆరుఇరవై ఏడు సంవత్సరానికి రూ. అరవై లక్షల యాభై వేల రూపాయలు, రెండువేల ఇరవై ఏడుఇరవై ఎనిమిది సంవత్సరానికి రూ. అరవై ఆరు లక్షల యాభై ఐదు వేల రూపాయలుగా నిర్ణయించినట్లు వెల్లడించారు.
ఎంపిక ప్రక్రియలో భాగంగా ఫిబ్రవరి ఐదు, రెండువేల ఇరవై ఆరు ఉదయం ఎనిమిది గంటలకు భీమవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పిజిఆర్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ గారి ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం ప్రతి బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వచ్చిన పక్షంలోనే లక్కీ డ్రా నిర్వహిస్తామని, ఎంపికైన అభ్యర్థి ఎంపికైన వెంటనే మొదటి విడత రిటైల్ ఎక్సైజ్ పన్నును తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.
ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన మరిన్ని వివరాల కోసం తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని లేదా 9440902433 నంబర్‌ను సంప్రదించాలని తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీమతి ఈ. స్వరాజ్యలక్ష్మి తెలిపారు.

# దేవాదాయ శాఖ మంత్రి కలిసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..

**కోరుకొండ, పెన్ పవర్, జనవరి 28:**రాజానగరం నియోజకవర్గం లోని వివిధ దేవాలయాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి అనం రామనారాయణ రెడ్డి , ఎండోమెంట్ కమీషనర్ రామచంద్ర మోహన్ ను బుధవారం రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ కలిశారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ మంత్రితో

పుష్కరాలు–2027 క్రింద నియోజకవర్గం లోని దేవాలయాల అభివృద్ధి ప్రస్తుతం ప్రతిపాదించిన రూ.98 లక్షలు గాకుండా మరో రూ.6.34 కోట్లు మంజూరు చేయాలని వినతిపత్రం అందచేశారు. మరియు'ప్రసాద్' పథకం ద్వారా కోరుకొండ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయ అభివృద్ధికి రూ 36 కోట్లు మంజూరు చేయాలని శ్రీ రంగనాథ స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి రూ.60.00 లక్షలు మంజూరు చేయాలని కనుపూరు మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి రూ 20.00 కోట్లు మంజూరు చేయాలని 63 దేవాలయాలకు ధూప దీప నైవేద్యం పథకం (డి డిఎన్స్) క్రింద మంజూరు చేయాలని వినతి పత్రం అందించారు.



## క్రీడా కోట కింద 22 మందికి ఉద్యోగాలు.

శాప్ డైరెక్టర్ జగదీశ్వరి.



**గోపాలపురం /పోలవరం, పెన్ పవర్, జనవరి 28.** రాష్ట్రంలో ఇటీవల జరిగిన గ్రూప్–2 పరీక్షల్లో క్రీడా వాటా కింద 22 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కలిగిందని రాష్ట్ర ప్రాధికార సంస్థ నిర్వాహకురాలు కొవ్వాసు జగదీశ్వరి అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం ఆనందదాయకం అన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కోట్లాది రూపాయల హెచ్చించి క్రీడా సంస్థను అభివృద్ధి చేసిందన్నారు. ఎందరో క్రీడాకారులకు ఎన్నో క్రీడా వస్తువులను ఉచితంగా అందించడం జరిగిందన్నారు. రకరకాల క్రీడల్లో ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయులు ద్వారా క్రీడాకారులకు శిక్షణ సైతంఇప్పించడం జరిగింది అన్నారు. ఎందరో క్రీడల్లో రాణించి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో తమ ప్రతిభ పాఠవాలను ప్రదర్శించారన్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్ లో పరీక్షల్లో క్రీడా కోట కింద 22 మంది యువకులు ఎంపిక కావడం ఆనందదాయకమన్నారు. ఇదిలా ఉంటే ప్రముఖ అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రజి జ్యోతి కి ప్రభుత్వం అండగా ఉందని రుజువైందన్నారు. క్రీడల్లో ఆమెను ప్రోత్సహిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మానవనురుల శాఖ మంత్రి నారా లోకేష్ లు స్పందించి గ్రూప్ వన్ ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వడానికి క్యాబినెట్ ఆమోదం చేయడం సంతోషాన్ని కలిగిస్తుంది అన్నారు. ఇంత మహోన్నత మైన కార్యక్రమాన్ని దగ్గరుండి చేయించిన శాప్ చైర్మన్ రవి నాయుడు కి జగదీశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి వారిని ఆదర్శంగా తీసుకుని యువత క్రీడల్లో రాణించి తమ జీవితాన్ని బంగారు మయం చేసుకోవాలని ఆమె కోరారు.

## ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహణ



**చింతూరు, పెన్ పవర్, జనవరి 28:**పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చింతూరు మండలం పెద్దశితనపల్లి పంచాయతీ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో ఉచిత పశు వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశు వైద్యులు యు. అనిల్ కుమార్, ఎన్. ప్రవీణ్ చీడుమూరు హాజరై పశువులకు అవసరమైన మందులు అందించారు.
మేకలు, గొర్రెలు, ఆవులు, గేదెలకు వ్యాక్సినేషన్ చేపట్టడంతో పాటు పశు గ్రాసాల వినియోగం, పశు బీమా చేయించుకోవాల్సిన ప్రాముఖ్యతను గ్రామస్థులకు వివరించారు. పశువుల ఆరోగ్యం మెరుగుపడితే రైతుల ఆర్థిక స్థితి బలోపేతం అవుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల వైస్ ప్రెసిడెంట్ తీగల రవి, మండల ప్రధాన కార్యదర్శి కారం దుర్గారావు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు. పలువురు గ్రామస్థులు హాజరై శిబిర సేవలను సద్వినియోగం చేసుకున్నారు.

# రేపు నారా లోకేష్ కాకినాడ పర్యటన..

- నారా లోకేష్ కు ఘన స్వాగతం పలకాలని బొడ్డు పిలుపు..
- బూరుగుపూడి తెలుగుదేశం పార్టీ కార్యాలయం మీదుగా నారా లోకేష్..



**కోరుకొండ, పెన్ పవర్,జనవరి 28:** శుక్రవారం ఉదయం 8 గంటలకు మంత్రి నారా లోకేష్ మధురపూడి విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుండి రోడ్డు మార్గాన కాకినాడ పర్యటనలో భాగంగా ఆయన బూరుగుపూడి తెలుగుదేశం పార్టీ కార్యాలయం మీదుగా ప్రయాణం చేస్తారని మంత్రి నారా లోకేష్ కు ఘన స్వాగతం పలకాలని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు నాయకులకు కస్టర్ అండ్ బూత్ ఇంచార్జ్ లకు తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి బూరుగుపూడి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పిలుపునిచ్చారు.

# వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బలోపేతానికి కృషి చేస్తా. ఎమ్మెల్సీ అనంత. ఉదయ భాస్కర్...





**అడ్డతీగల, పెన్ పవర్, జనవరి 28 :**అడ్డతీగల మండలం ఎల్లవరం ఎమ్మెల్సీ అనంతబాబు స్వగృహం లో,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సంస్థాగత సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి. ధనలక్ష్మి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి నియోజకవర్గంలోని 12 మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు.
పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, గ్రామస్థాయిలో కమిటీల పునర్వ్యవస్థీకరణ, ప్రజా సమస్యలపై ఉద్యమాత్మకంగా పనిచేయడంపై అనంత. ఉదయ భాస్కర్ నేతలు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వాన్ని మరింత బలపరచాలని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో రంపచోడవరం, దేవీపట్నం, వై.రామవరం, అడ్డతీగల, గంగవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి సహా 12 మండలాల పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని నేతలు స్పష్టం చేశారు.

# దివ్య పట్టుదల ఫలితం గ్రూప్ 2 సాధన

దివ్య విజయం చింతూరుకు గర్వకారణం



**చింతూరు, పెన్ పవర్ జనవరి 28:**చింతూరు మండలానికి చెందిన గిరిజన విద్యార్థిని తుర్రం దివ్య గ్రూప్ 2 ఫలితాల్లో సత్తా చాటి అందరి ప్రశంసలు పొందుతోంది. పేద కుటుంబ పరిస్థితుల మధ్య చదువును కొనసాగించిన దివ్య ఎన్నో కష్టాలను ఎదుర్కొని ఈ విజయాన్ని సాధించింది. గ్రామీణ వాతావరణంలో పెరిగినప్పటికీ చదువుపై ఉన్న పట్టుదలతో రోజూ క్రమశిక్షణగా చదువుతూ ముందుకు సాగింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఆమెకు ఎంతో తోడ్పడింది. ఈ విజయం ద్వారా ప్రభుత్వ ఉద్యోగం సాధించే దిశగా దివ్య అడుగు వేయడం చింతూరు మండల ప్రజలకు గర్వకారణంగా మారింది. ఆమె సాధించిన విజయంతో గ్రామంలోని యువతీ యువకులకు కొత్త ఉత్సాహం వచ్చింది. కష్టపడితే ఏ లక్ష్యమైనా సాధించవచ్చని దివ్య నిరూపించిందని స్థానికులు అభినందనలు తెలుపుతున్నారు.

# ఎస్సీల సంక్షేమ ఫలాలు అర్హులకు చేరేలా సమిష్టిగా కృషి చేయాలి




రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఘన సన్మానం

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 28:**జిల్లా సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ ని జిల్లా అధికారులు, ఎన్జీవో ఉద్యోగ సంఘాల నాయకులు, ఇతర ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా చైర్మన్ కె.ఎస్. జవహర్ మాట్లాడుతూ, ఎస్సీ కమిషన్ ద్వారా ఎస్సీ వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు, ఉద్యోగ సంఘాలు, ప్రజాప్రతినిధులు అందరూ కలిసి కట్టుగా విధులను నిర్వర్తించాలని కోరారు.
కొంతమంది అధికారులు తమ బాధ్యతను కేవలం ఉద్యోగంగా కాకుండా, సమాజ సేవగా భావిస్తూ అంకితభావంతో పనిచేస్తున్న తీరు ప్రేరణనిచ్చిందని తెలిపారు. ఆ దిశగా వారి నిబద్ధత, సేవా దృక్పథం స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. సమాజ అభివృద్ధికి ఇదే మార్గమని, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించాలని ఆయన ఆకాంక్షించారు.

# గ్రూప్2లో బాదంపూడి మహిళల సత్తా

ఇద్దరికి ప్రభుత్వ ఉద్యోగాలు





**పెన్ పవర్, ఉంగుటూరు । జనవరి 28**గత ఏడాది నిర్వహించిన గ్రూప్2 పరీక్షా ఫలితాల్లో ఉంగుటూరు మండలం బాదంపూడి గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు ప్రతిభ చూపి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం గ్రామానికి గర్వకారణంగా నిలిచింది.
బాదంపూడి జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని గజ్జరపు శ్వేత గ్రూప్2 పరీక్షల్లో విజయం సాధించి డిప్యూటీ తహశీల్దార్గా ఎంపికయ్యారు. హైస్కూల్ విద్య అనంతరం అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేసిన శ్వేత గ్రామీణ నేపథ్యం నుంచి ఈ స్థాయికి చేరుకోవడం ప్రశంసనీయమని గ్రామస్థులు అభినందనలు తెలిపారు.
అదేవిధంగా బాదంపూడి గ్రామానికి చెందిన ఆలపాటి శ్రీవల్లి కూడా గ్రూప్2 పరీక్షల్లో ప్రతిభ చూపి లిఅమరావతి సెక్రటేరియట్‌లో ఏఎస్వో (జీఏడీ)లిగా ఉద్యోగం సాధించారు. శ్రీవల్లి ప్రాథమిక విద్య బాదంపూడిలో పూర్తి చేయగా, ఉన్నత పాఠశాల విద్య, ఇంటర్, బీటెక్ విద్యలను తాడేపల్లిగూడెంలోని ప్రైవేటు విద్యాసంస్థల్లో అభ్యసించారు.
గ్రామీణ ప్రాంతం నుంచి గ్రూప్2 వంటి పోటీ పరీక్షల్లో ఒకేసారి ఇద్దరు మహిళలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం పట్ల బాదంపూడి గ్రామస్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరెందరో యువతకు వీరు ఆదర్శంగా నిలుస్తారని అభిప్రాయపడ్డారు.

# ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజాకి వినతి పత్రం..

- రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..



**కోరుకొండ, పెన్ పవర్, జనవరి 28:.**ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజాకి వినతి బుధవారం ఉదయం ఆయన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న పలు అంశాల గురించి కృష్ణ తేజకు వివరించారు. అమరజీవి జలధార పథకం ప్రజలకు సమగ్ర రక్షిత త్రాగునీటి సరఫరా కోసం 681.90 కోట్లు మంజూరు చేయాలి అని శ్రీ సత్య సాయి మంచినీటి పథకాన్ని పునరుద్ధరించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కోరారు.
అమర జీవి జలధార పథకం వల్ల రాజానగరం తో పాటు అనపర్తి, జగ్గంపేట నియోజకవర్గాలకు నియోజకవర్గాలకు ప్రయోజనం
రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లో సమగ్ర డ్రైనేజీ వ్యవస్థకు నిధులు మంజూరు చేయాలి
కొత్త డ్రైనేజీలు నిర్మించాలి రాజానగరం నియోజకవర్గంలో కొత్త రోడ్ల నిర్మాణాలకు 22.56 కోట్ల నిధులు అత్యవసరం పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ తో వారి కార్యాలయం నందు ప్రత్యేకంగా భేటీ అయిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని రాజానగరం నియోజకవర్గానికి అమరజీవి జల ధార సమగ్ర సురక్షిత మంచినీటి పథకం మంజూరు చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ శ్రీకృష్ణ తేజను కోరారు.

## రైతుల సమస్యలు సత్వరం పరిష్కరించాలి. సువర్ణ రాజు.




**గోపాలపురం/నల్లజర్ల, పెన్ పవర్, జనవరి 28.**
నియోజకవర్గంలోని రైతులు సంబంధించిన భూ సమస్యలను రెవెన్యూ అధికారులు తక్షణం పరిష్కరించాలని జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డి గర్ల సువర్ణ రాజు రెవెన్యూ అధికారులను కోరారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక తహసీల్దార్ కృష్ణారావుని కలిశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. స్మశానాలు ఆక్రమణ తదితర విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ గత ఏడాది భూసర్వే కారణంగా పలు సమస్యలు ఉత్పన్నమయ్యాయి అన్నారు. కూటమి ప్రభుత్వ చొరవతో రెవెన్యూ అధికారులు వాటిని పరిష్కరించే దిశగా పనిచేయడం ఆనందదాయకం అన్నారు. ప్రజల సమస్యల్ని పరిష్కరించవలసిన బాధ్యత అధికారులు ది అన్నారు. ఆయన వెంట జనసేన నల్లజర్ల మండల శాఖ అధ్యక్షులు చోడ సాని బాపిరాజు, ఐటీ కోఆర్డినేటర్ ఉన్నమట్ల సత్య కిరణ్, మండల పార్టీ కార్యదర్శి కొత్తపల్లి హరిబాబు, జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు కవులూరి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## మెనూ సక్రమంగా అమలు చేయాలి



**గంగవరం, పెన్ పవర్ ,జనవరి 28:**పాఠశాల విద్యార్థుల కోసం ప్రభుత్వం నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలు చేయాలని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని మర్రిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే పాఠశాలలోని పలు సమస్యలను ఉపాధ్యాయులు ఎంపీపీ దృష్టికి తీసుకుని వచ్చారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాల విద్యార్థుల కోసం సిద్ధం చేసిన వంటకాలను రుచి చూసి సంతృప్తి చేశారు. విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ తదితరులున్నారు.

## అన్నవరంగ్రామంలో మెగావైద్యశిబిరం



**వి.ఆర్.పురం పెన్.పవర్.జనవరి.28:**మండలంలోని అన్నవరం గ్రామంలో బుధవారం ఆంధ్ర వనవాసి కల్యాణ్,ఆశ్రమం విశాఖపట్నం వారిచే డాక్టర్, శ్రీనివాసరావు,మండలప్రచారక్,ఐ.వి.వి.ప్రసాద్,ఆద్వర్యంలో మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.అనంతరం నూట యాబై మంది రోగులకు పరిక్షలు నిర్వహించి,తగిన మం దులు అందజేశారు.ఈసందర్భంగా డాక్టర్,శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలోని ఉమ్మిడివరం,తదితర గ్రామాలలోజరగబోవు మెగా వైద్యశిబిరాన్ని మండల ప్రజ లు సద్వినియోగం చేసుకోవాలని,కోరారు.ఈ కార్యక్రమం లోఅన్నవరం గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పార్థ స్వామి కి ఉత్తమ సేవా పురస్కారం



**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ ,జనవరి 28:**
తిరుమల తిరుపతి దేవస్థానములు ద్వారా నిర్వహించబడుతున్న ఐ.పోలవరం లోని గోవిందగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం లో అర్చకులుగా విధులు నిర్వహిస్తున్న శ్రీ దీవి పార్థవేంకటరామశ్రీనివాస్ ఉత్తమ సేవలను గుర్తిస్తూ వారికి దేవస్థానం వారు ఉత్తమఅర్చకఅవార్డు ను అందజేశారు.
ఈ సందర్భంగా స్వామి సేవలో వారి నిరంతర సేవను, నిబద్ధతను,స్వామి సేవా నిరతిని గుర్తించినందుకు దేవస్థానము కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంలో వారు స్వామి కైంకర్యంలో చూపించే అత్యంత భక్తి శ్రద్ధలు, కార్యదీక్ష,అపారమైన స్వామి భక్తి కలిగిన వారని, స్వామి కైంకర్యాలకై నిత్యము భక్తులను సిద్ధపరచుటలో ముందుంటారని గుర్తు చేసుకుంటూ, ఆలయ అధికారులు మరియు భక్తులు అలాగే శ్రీవారి సేవకు బృందం వారందరూ వారిని అభినందించారు.

## టి.నర్సాపురం ప్రెస్ క్లబ్ సభ్యులకు ప్రమాద బీమా పాలసీలు



**జీలుగుమిల్లి, టీ నర్సాపురం, పెన్ పవర్, జనవరి 28:**
టీ నర్సాపురం ప్రెస్ క్లబ్ సభ్యులకు ప్రమాద బీమా పాలసీలు కట్టించిన జనసేన నేత నవీన్ కు అభినందనలు అని టి.నర్సాపురం ప్రెస్ క్లబ్ సభ్యులు తెలిపారు. బుధవారం టి.నర్సాపురం లో ప్రెస్ క్లబ్ సభ్యులకు జనసేన నాయకులు సి.హెచ్. నవీన్ ఒక్కొక్కరికి రూ. 15 లక్షల ప్రమాద బీమా పాలసీ చేయించి పాత్రికేయుల పట్ల ఆయనకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. 20 మంది సభ్యులకు నవీన్ సొంత నిధులతో పోస్టా ఫీస్ పాలసీని చేయించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా, సమాజాభివృద్దే ధ్యేయంగా కృషి చేస్తున్న పాత్రికేయ మిత్రులకు తన వంతు కర్తవ్యంగా ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని నిర్ణయించుకొని, నా సొంత ఖర్చుతో బీమా పాలసీలు చేయించానని తెలిపారు. పాత్రికేయులు కూడా ప్రజా ప్రతినిధులు, ప్రజా నాయకులు, అధికారులతో పాటు సమానంగా ప్రజల సంక్షేమం కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని, అటు వంటి వారి భద్రత కూడా చూడడం అందరి కర్తవ్యం అని ఆయన పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా టీ. నర్సాపురం మండల అభివృద్ధికి నిస్వార్థంగా శ్రమిస్తున్న జర్నలిస్టులందరికీ ప్రమాద బీమా సౌకర్యం ఏర్పాటు చేసినందుకు సంతోషిస్తున్నానని నవీన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పసుమర్తి రాము కార్యదర్శి నాదెండ్ల కృష్ణ గిరి కుమార్ మరీదు నాగేశ్వరరావు నందికొండ రామకృష్ణ పరస శ్రీను సుందరం గుడెల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# పర్యావరణ పరిరక్షణ నేడు కేవలం ఒక సామాజిక బాధ్యత.







వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె. ధనుంజయ రావు.

**వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయంలో 'స్వచ్ఛాంధ్ర'ఏ 2047 విజన్.**

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, డిసెంబర్ 20.**గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్లో భాగంగా, డాక్టర్ వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఈ నెల 'స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని 'పర్యావరణంలో అవకాశాలు' అనే ఇతివృత్తంతో 2 శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె. ధనుంజయ రావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ నేడు కేవలం ఒక సామాజిక బాధ్యత మాత్రమే కాదని, అది యువతకు అపారమైన ఉపాధి మరియు వ్యాపార అవకాశాలను తెరిచే ఒక శ్వాసించే ఆర్థిక వ్యవస్థ అని పేర్కొన్నారు. ఘన మరియు ద్రవ వ్యర్థాల నిర్వహణ వనరుల పునర్వినియోగం మరియు రీసైక్లింగ్ ద్వారా విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.
ముఖ్యంగా భారతీయ మూలాల్లో ఉన్న 'జుగాడ్' (తక్కువ వనరులతో అద్భుతమైన పరిష్కారాలు) ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని, స్థానికంగా దొరికే వ్యర్థాలతో వినూత్నమైన వ్యవసాయ పరికరాలు మరియు గృహోపకరణాలు తయారు చేయాలని విద్యార్థులకు సూచించారు. 'వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్ప్రెన్యూర్' లక్ష్య సాధనలో భాగంగా పర్యావరణ అనుకూల ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని, అటువంటి వినూత్న ఐడియాలు ఉన్న విద్యార్థులకు విశ్వవిద్యాలయం తరపున బ్యాంక్ లోన్లు మరియు పెట్టుబడులు అందేలా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ బి. శ్రీనివాసులు, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఎస్. సూర్యకుమారి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ బి. ప్రసన్న కుమార్ మరియు ఇతర అధికారులు, బోధనేతర సిబ్బంది పాల్గొని క్యాంపస్ ఆవరణలో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# శ్రీ స్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజని





**మంగళ వాయిద్యాల నడుమ ఘన స్వాగతం**

**శాస్త్రోక్తంగా స్వామివారి పూజలు**

**సింహాచలం, పెన్ పవర్, జనవరి 28 :**సింహగిరిపై కొలువై ఉన్న శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామివారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ ఉపలోకాయుక్త మరియు ఇంచార్జ్ లోకాయుక్త పి.రజని బుధవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. అధికారిక ప్రోటోకాల్ పర్యటనలో భాగంగా ఆమె సింహాచలం క్షేత్రానికి విచ్చేయగా, ఆలయ అధికారులు మరియు అర్చకులు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. ఆలయ రాజగోపురం వద్ద గౌరవ ఉపలోకాయుక్తకు దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరావు స్వాగతం పలికారు. అనంతరం నాదస్వర మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ ఆమెను ఆలయ ప్రాంగణంలోకి తీసుకువెళ్లారు. దర్శన క్రమంలో భాగంగా ఆలయ సంప్రదాయం ప్రకారం భక్తుల కోర్కెలు తీర్చే కప్పస్తంభాన్ని ఉపలోకాయుక్త భక్తిశ్రద్ధలతో ఆలింగనం చేసుకున్నారు.
అనంతరం గర్భాలయంలో కొలువై ఉన్న కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు ఆమెకు వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి శ్రీ కె. తిరుమలేశ్వరావు స్వామివారి శేష వస్త్రంతో ఆమెను సత్కరించి, తీర్థ ప్రసాదాలు మరియు స్వామివారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు.
స్వామివారి దర్శనం అనంతరం ఉపలోకాయుక్త పి.రజని మాట్లాడుతూ, సింహాచల క్షేత్ర పవిత్రత, ప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణం తనను ఎంతో ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ క్షేత్రం భక్తులకు ఆధ్యాత్మిక శక్తిని, మనోశాంతిని ప్రసాదించే దివ్య స్థలమని కొనియాడారు.
ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి కె. వెంకటేశ్వరరావు, డెప్యూటీ డైరెక్టర్ (ఇన్వెస్టిగేషన్) వై.గోవిందరావు, ఆలయ అధికారులు, అర్చక స్వాములు, ప్రోటోకాల్ అధికారులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సింహాచలం అప్పన్న హుండీ ఆదాయం లెక్కింపు పూర్తి

* 21 రోజుల్లో రూ.1.85 కోట్లకు పైగా ఆదాయం





**సింహాచలం, పెన్ పవర్, జనవరి 28 :**
విశాఖపట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామివారి దేవస్థానం, సింహాచలంలో హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం బుధవారం పారదర్శకంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్.సుజాత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధతో పాటు దేవాదాయ శాఖకు చెందిన అధికారులు పర్యవేక్షించారు. గత 21 రోజుల కాలానికి (జనవరి 07 నుండి జనవరి 28 వరకు) భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను అధికారులు లెక్కించారు. ఈ కాలంలో భక్తుల నుండి మొత్తం రూ.1,85,15,811 నగదు ఆదాయం సమకూరినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు. భారతీయ కరెన్సీ నోట్ల రూపంలో రూ.1,74,13,815, నాణేల రూపంలో రూ.11,01,996 లభించాయి. దీంతో మొత్తం నగదు ఆదాయం కోటి ఎనభై ఐదు లక్షల పదిహేను వేల ఎనిమిది వందల పదకొండు రూపాయలుగా నమోదైంది. రోజువారీ సగటు హుండీ ఆదాయం సుమారు రూ.8,81,705గా ఉన్నట్లు అధికారులు తెలిపారు.
అలాగే భక్తులు మొక్కుబడుల రూపంలో సమర్పించిన విలువైన లోహాల వివరాలను కూడా లెక్కించారు. ఈ 21 రోజుల్లో బంగారం 55 గ్రాముల 500 మిల్లీగ్రాములు, వెండి 6 కిలోల 140 గ్రాములు లభించినట్లు వెల్లడించారు. దేశ విదేశాల నుంచి సింహాచలం అప్పన్న దర్శనానికి వచ్చిన భక్తులు విదేశీ కరెన్సీని కూడా హుండీలో సమర్పించారు. ముఖ్యంగా అమెరికా నుంచి 174 డాలర్లు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి 295 దిర్హామ్స్, సౌదీ అరేబియా నుంచి 110 రియాల్స్, కువైట్ నుంచి 6.75 దినార్లు లభించాయి. ఇవే కాకుండా సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా, నేపాల్, ఓమన్, ఖతార్, నైజీరియా, వియత్నాం దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు కూడా హుండీలో లభించినట్లు అధికారులు తెలిపారు.
హుండీ లెక్కింపు కార్యక్రమం మొత్తం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య, సీసీటీవీ నిఘా నీడలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, సిబ్బంది, అలాగే బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు. భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టేలా పూర్తి పారదర్శకతతో ఈ లెక్కింపు ప్రక్రియను నిర్వహించినట్లు దేవస్థానం అధికారులు స్పష్టం చేశారు.

# ప్రభుత్వ భూములపై రాజకీయ దుమారం





**గీతం రెగ్యులరైజేషన్కు వ్యతిరేకంగా వైయస్సార్సీపీ వినతి**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 28 :**విశాఖపట్నంలో రూ.5 వేల కోట్ల విలువైన 54.79 ఎకరాల ప్రభుత్వ భూమిని గీతం విద్యా సంస్థలకు రెగ్యులరైజ్ చేయాలన్న ప్రతిపాద నను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్రంగా స్పం దించారు. ఈ మేరకు శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో వైయస్సా ర్సీపీ నేతలు జీవీఎంసీ కమిషనర్, మేయర్లకు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కే.కే. రాజు, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు సహా పలు వురు కార్పొరేటర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు. అనంతరం బొత్స సత్యనారాయణ, కే.కే. రాజు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.
భూదోపిడీకి ప్రభుత్వం అండ బొత్స ఆరోపణలు
విశాఖలో సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబం భూదోపిడీకి పాల్పడుతోందని బొత్స సత్యనారాయణ ఆరోపించారు. లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న గీతం విద్యాసంస్థలు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, దానిని రెగ్యులరైజ్ చేయించుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గమని వ్యాఖ్యానించారు. ఈ నెల 30న జరగనున్న జీవీఎంసీ కౌన్సిల్ సమా వేశ అజెండాలో ఈ ప్రతిపాదనను చేర్చవద్దని అధికారులను కోరినట్లు తెలిపారు.ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రాజకీయ పార్టీలు, మేధావులతో కలిసి ఉద్యమాన్ని ఉధృ తం చేస్తామని హెచ్చరించారు. గీతం సంస్థల ఆక్రమణలో ఉన్న భూములను స్వయంగా పరిశీలించనున్నట్లు వెల్లడించారు.కూటమి పార్టీల వైఖరి చెప్పాలి ఈ భూదోపిడీపై కూటమిలో భాగస్వామ్యులైన బీజేపీ, జనసేన పార్టీలు స్పష్టమైన వైఖరి వెల్లడించాలని బొత్స డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యా ణ్ ఈ అంశంపై సమాధానం చెప్పాలని ప్రశ్నిం చారు. "స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే ప్రభుత్వ భూములు దోచుకోవడమేనా?" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.సిట్ను తిరిగి ప్రారంభించాలి
విశాఖ భూదోపిడీలపై గతంలో ఏర్పాటు చేసిన సిట్ను మళ్లీ ఓపెన్ చేసి వాస్తవాలను వెలుగు లోకి తీసుకురావాలని బొత్స డిమాండ్ చేశారు. పేదల చిన్న ఆక్రమణలను రెగ్యులరైజ్ చేయడం ఒక విషయం అయితే, వేల కోట్ల విలువైన ప్రభు త్వ భూమిని రాజకీయ ప్రభావంతో రెగ్యులరైజ్ చేయడం అన్యాయమని అన్నారు.
కే.కే. రాజు విమర్శలు
వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు కే.కే. రాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ గీతం యూనివ ర్సిటీకి వేల కోట్ల విలువైన భూములు కట్టబెడు తోందని ఆరోపించారు. జీవీఎంసీ కౌన్సిల్ అజెం డాలోని ఈ ప్రతిపాదనను వెంటనే తొలగించాల ని డిమాండ్ చేశారు. విశాఖలో జరుగుతున్న భూదోపిడీపై మేధావులు, ప్రజలు ఆలోచించాల ని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేట ర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# మారుమూల పల్లె నుంచి రాష్ట్ర స్థాయి కొలువుకు రెడ్డి విజయలక్ష్మి

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 28:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దారకొండ గ్రామానికి చెందిన గిరిజన యువతి రెడ్డి విజయశాంతి గ్రూప్2 ఫలితాల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి ఉద్యోగానికి ఎంపికయ్యారు. గ్రూప్2 పరీక్షల్లో ఆమె అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఎఎస్ఓ)గా నియామకానికి అర్హత సాధించి, తన ప్రతిభను చాటుకున్నారు. ప్రస్తుతం చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న విజయశాంతి, కష్టపడి చదివి ఈ స్థాయి విజయం సాధించడం పట్ల సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.విజయశాంతి తండ్రి రెడ్డి ధర్మయ్య గూడెం కొత్త వీధి మండల తహసీల్దార్ కార్యాలయంలో ఓఎస్గా విధులు నిర్వహిస్తుండగా, తల్లి సావిత్రి గృహిణి. మారుమూల గిరిజన గ్రామం నుంచి పంచాయతీ కార్యదర్శి స్థాయి ఉద్యోగం సాధించి, ఇప్పుడు రాష్ట్ర స్థాయి ఉన్నత ఉద్యోగానికి ఎంపిక కావడం యువతకు ఆదర్శంగా నిలుస్తోంది.ఆమె విజయంపై కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



# వరల్డ్ కప్ ముందు క్రేజీ సిరీస్: ఆస్ట్రేలియాతో పాకిస్థాన్ టీ20 సిరీస్.. లైవ్ స్ట్రీమింగ్, స్క్వాడ్, టైమింగ్ వివరాలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** వరల్డ్ కప్ ముందు మరో క్రేజీ సిరీస్ క్రికెట్ ఫ్యాన్స్ ను అలరించడానికి సిద్ధంగా ఉంది. పాకిస్థాన్, ఆస్ట్రేలియా జట్లు మూడు మ్యాచ్ ల టీ20 సిరీస్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇందులో భాగంగా తొలి మ్యాచ్ గురువారం (జనవరి 29) జరగనుంది. ఈ మ్యాచ్ కు లాహోర్‌లోని గడాఫీ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. ఆస్ట్రేలియా జట్టును మిచెల్ మార్ష్ లీడ్ చేయనున్నాడు. మరోవైపు పాకిస్థాన్ జట్టుకు సల్మాన్ అలీ అఘా నడిపించనున్నాడు. సొంతగడ్డపై ఆస్ట్రేలియాను ఓడించాలని పాకిస్థాన్ గట్టి పట్టుదలగా ఉంది. మరోవైపు వరల్డ్ కప్ ముందు ఉపఖండపు పరిస్థితులు అర్ధం చేసుకొని వరల్డ్ కప్ కు బరిలోకి దిగాలని కంగారూల జట్టు భావిస్తుంది.

ఓ వైపు ఇండియా, న్యూజిలాండ్ జట్లు విశాఖపట్నం వేదికగా ఈ రోజు నాలుగో టీ20 ఆడుతుంటే మరోవైపు ఆస్ట్రేలియా, పాకిస్థాన్ జట్లు రేపు లాహోర్ లో తొలి టీ20 ఆడనున్నాయి. ఈ రెండు రోజులు ఫ్యాన్స్ కు డబుల్ కిక్ ఖాయంగా కనిపిస్తుంది. ఆస్ట్రేలియా జట్టులో కీలక స్టార్లు జోష్ హాజిల్‌వుడ్, పాట్ కమ్మిన్స్, గ్లెన్ మాక్స్‌వెల్, టిమ్ డేవిడ్ స్వల్ప గాయాల కారణంగా సిరీస్ కు అందుబాటులో ఉండడం లేదు. ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్, కామెరాన్ గ్రీన్, జోష్ ఇంగ్లిస్, మార్కస్ స్టోయినిస్, కూపర్ కొన్నోలీ, మిచ్ ఓవెన్ రూపంలో ఆస్ట్రేలియా బ్యాటింగ్ పటిష్టంగా కనిపిస్తుంది.

**పాక్ జట్టులో బాబర్, అఫ్రిది:**

ఇటీవలే జరిగిన బిగ్ బాష్ లీగ్ లో రాణించకపోయినా పాకిస్థాన్ టీ20 జట్టులో బాబర్ అజామ్ కు చోటు కల్పించారు. బిగ్ బాష్ లీగ్ లో బాబర్ 11 మ్యాచ్‌ల్లో 103.06 స్ట్రైక్ రేట్‌తో కేవలం 202 పరుగులు మాత్రమే చేశాడు. వరల్డ్ కప్ ముందు టోర్నీ కావడంతో బాబర్ అనుభవాన్ని పాక్ క్రికెట్ బోర్డు వినియోగించుకోవాలని చూస్తున్నట్టు అర్ధమవుతోంది. బాబర్ తో పాటు స్టార్ ఫాస్ట్ బౌలర్ షాహీన్ అఫ్రిది కూడా ఎంపికయ్యాడు. కొంతకాలంగా పాకిస్థాన్ టీ20 జట్టుకు దూరంగా ఉన్న అఫ్రిది జట్టులో చేరాడు. స్టార్ ప్లేయర్స్ మహ్మద్ రిజ్వాన్, హరిస్ రౌఫ్ వంటి సీనియర్ ఆటగాళ్లను పాకిస్థాన్ జట్టు నుండి తొలగించింది.

**ఆస్ట్రేలియాతో తలపడే పాకిస్తాన్ 16 మంది సభ్యుల జట్టు:**

సల్మాన్ అలీ అఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, బాబర్ ఆజం, ఫహీమ్ అష్రఫ్ , ఫఖర్ జమాన్,

ఖవాజా మహ్మద్ నఫాయ్ (వికెట్ కీపర్), మహ్మద్ నవాజ్, మహ్మద్ సల్మాన్ మీర్జా, మహ్మద్ వసీం జూనియర్, నసీమ్ షా, సాహిబ్జాదా ఫర్హాన్, సైమ్ అయూబ్, షహీన్ షా అఫ్రిది, షాదాబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్, ఉస్మాన్ తారిఖ్

**ఆస్ట్రేలియా జట్టు:**

మిచెల్ మార్ష్ (కెప్టెన్), సీన్ అబాట్, జేవియర్ బార్ట్‌లెట్, మహ్లి బియర్డ్‌మాన్, కూపర్ కొన్నోలీ, బెన్ ద్వార్షుయిస్, జాక్ ఎడ్వర్డ్స్, కామెరాన్ గ్రీన్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహ్నెమాన్, మిచ్ ఓవెన్, జోష్ ఫిలిప్, మాథ్యూ రెన్షా, మాథ్యూ షార్ట్, మార్కస్ స్టోయినిస్, ఆడమ్ జంపా

**లైవ్ స్ట్రీమింగ్. లైవ్ టెలికాస్టింగ్ ఎందులో చూడాలంటే..?**

భారత కాలమాన ప్రకారం ఆస్ట్రేలియా, పాకిస్థాన్ జట్ల మధ్య తొలి టీ20 రాత్రి 8:30 గంటలకు ప్రారంభమవుతుంది. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెల్‌లలో ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. ఆన్‌లైన్ స్ట్రీమింగ్ వెబ్ బ్రౌజర్‌లలోని సోనీ లివ్ యాప్ లో చూడొచ్చు.

# హై స్కోరింగ్ థ్రిల్లర్‌కు రంగం సిద్ధం.. నాలుగో టీ20కి పిచ్ రిపోర్ట్, వాతావరణం ఎలా ఉందంటే..?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, న్యూజిలాండ్ జట్ల మధ్య మరికొన్ని గంటల్లో నాలుగో టీ20 జరగనుంది. బుధవారం (జనవరి 28) ఇరు జట్ల మధ్య విశాఖపట్నం ఈ మ్యాచ్ కు వేదిక కానుంది. ఇప్పటికే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకున్న సూర్యకుమార్ సేన బుధవారం (జనవరి 28) జరిగే నాలుగో టీ20లోనూ గెలిచి క్లీన్ స్వీప్ లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. మరోవైపు ఇప్పటికే సిరీస్ కోల్పోయిన కివీస్ నాలుగో టీ20లో ఇండియాకు షాక్ ఇచ్చి ఎలాగైనా బోణీ కొట్టాలని కసరత్తులు చేస్తుంది. ప్రస్తుతం 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో ఇండియా 3-0 ఆధిక్యంలో నిలిచింది. నాలుగో టీ20 బుధవారం (జనవరి 28) సాయంత్రం 7:00 గంటలకు ప్రారంభమవుతుంది. అభిషేక్ శర్మ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్ ధనాధన్ షాట్లతో ప్రత్యర్థి బౌలర్లను ముప్పుతిప్పలు పెడుతున్నారు. ముఖ్యంగా యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ 300 ప్లస్ స్ట్రైక్ రేట్‌తో రన్స్ రాబడుతుండటం విశేషం. 200 ప్లస్ టార్గెట్‌ను 15 ఓవర్లలో.. 150 పైచిలుకు లక్ష్యాన్ని పది ఓవర్లోనే ఛేజ్ చేయడం చూస్తుంటే, కివీస్ బౌలర్లకు ఈ మ్యాచ్‌లోనూ నిద్రలేకుండా చేసేలా కనిపిస్తోంది. నాలుగో టీ20లో ఇండియా రెండు మార్పులతో బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యకు నాలుగో టీ 20లో రెస్ట్ ఇవ్వనున్నట్టు తెలుస్తుంది. పనిభారం కారణంగా ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా వైజాగ్ టీ20కు దూరం కానున్నాడు.

**వైజాగ్ వాతావరం రిపోర్ట్స్:**


అక్యూవెదర్ యాప్ ప్రకారం.. బుధవారం (జనవరి 28) ఉదయం ఉష్ణోగ్రత 26 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉంది. మధ్యాహ్నం తర్వాత ఉష్ణోగ్రత కొద్దిగా 27 డిగ్రీలకు పెరిగి సాయంత్రం 21 డిగ్రీలకు పడిపోతుంది. ఎలాంటి వర్ష సూచనలు మ్యాచ్ కు ఉండవు. నైట్ ఎక్కువగా మంచు పడేఅవకాశాలు ఉన్నాయి.

**పిచ్ రిపోర్ట్ ఎలా ఉందంటే..?**

పిచ్ విషయానికి వస్తే వైజాగ్ టీ20కు పరుగుల వరద ఖయాంగా కనిపిస్తుంది. సాధారణంగా ఇక్కడ వికెట్ బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుంది. దీంతో ఈ మ్యాచ్ లో హై స్కోరింగ్ అని ఫ్యాన్స్ ఫిక్సయిపోయారు. మొదటి బ్యాటింగ్ సమయంలో పిచ్ కొంచెం నెమ్మదిగా ఉండి స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుంది. రెండో ఇన్నింగ్స్ సమయంలో మంచు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీంతో టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ తీసుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

# ఐసీసీ ర్యాంకింగ్స్... టాప్ 10లోకి సూర్యకుమార్ యాదవ్, నెంబర్ 1 స్థానంలోనే అభిషేక్

- **న్యూజిలాండ్ సిరీస్‌లో అదరగొడుతున్న సూర్యకుమార్, అభిషేక్ శర్మ**
- **929 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్న అభిషేక్**
- **ర్యాంకింగ్స్‌లో బుమ్రా, హార్దిక్ పాండ్య, శివమ్ దుబేలకు చోటు**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత క్రికెట్ జట్టు సారథి సూర్యకుమార్ యాదవ్ టాప్ టెన్ బ్యాట్స్‌మెన్ జాబితాలో తిరిగి చోటు దక్కించుకున్నాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో అదరగొడుతున్న సూర్యకుమార్ ఐదు స్థానాలు ఎగబాకి 717 రేటింగ్ పాయింట్లతో ఏడో స్థానానికి ఎగబాకాడు. పొట్టి క్రికెట్‌లో పరుగులు సాధించడానికి ఇబ్బంది పడుతున్న సూర్యకుమార్, ఫామ్‌లోకి వచ్చాడు. న్యూజిలాండ్‌తో జరిగిన రెండవ టీ20లో 82, మూడో టీ20లో 57 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. భారత ఓపెనర్ అభిషేక్ శర్మ కూడా మూడో టీ20లో 68 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 14 బంతుల్లోనే అర్ధ సెంచరీ చేశాడు. నాగపూర్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 35 బంతుల్లో 84 పరుగులు చేశాడు. తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 929 రేటింగ్ పాయింట్లతో తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు.

భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా నాలుగు స్థానాలు ఎగబాకి 13వ ర్యాంకులో నిలిచాడు. మూడో టీ20లో మూడు వికెట్లు తీసి రాణించాడు. ఆల్ రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్య ఒక స్థానం ఎగబాకి మూడో ర్యాంకుకు, శివమ్ దుబే ఐదు స్థానాలు ఎగబాకి పదకొండవ ర్యాంకుకు చేరుకున్నారు. అక్షర్ పటేల్ 3 స్థానాలు పడిపోయి 13వ ర్యాంకులో ఉన్నాడు.

# హీరో నేనే విలనూ నేనే.. 'యానిమల్' 3 భాగాలుగా!



శివంగి వర్మ తాజా స్నాప్‌లలో ఉష్ణోగ్రతను పెంచారు

రణబీర్ కపూర్ - సందీప్ వంగా కాంబినేషన్‌లో -యానిమల్- సంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇది కేవలం ఒక సీక్వెల్‌తో ముగిసిపోయేది కాదు.. మొత్తం మూడు భాగాలుగా రాబోతోంది. ఆ మేరకు రణబీర్ కపూర్ స్వయంగా ఈ విషయాన్ని ధృవీకరించారు.



దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఈ కథను ఒక ట్రయాలజీగా ప్లాన్ చేశారు. మొదటి భాగం -యానిమల్- కాగా, రెండో భాగం -యానిమల్ పార్క్-. మూడవ భాగానికి సంబంధించిన వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. ఇంతలోనే ఇప్పుడు యానిమల్ సీక్వెల్ -యానిమల్ పార్క్- షూటింగ్ 2027 లో ప్రారంభం కానుందని రణబీర్ ధృవీకరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొన్నాళ్ల పాటు వేచి చూడక తప్పదని కూడా రణబీర్ అన్నారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రస్తుతం ప్రభాస్ హీరోగా -స్పిరిట్- సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. ఆ సినిమా పూర్తయిన తర్వాతే సీక్వెల్ పట్టాలెక్కుతుంది. యానిమల్ రెండో భాగంలో రణబీర్ కపూర్ ద్విపాత్రాభినయం చేస్తారు. మొదటి భాగం చివరలో చూపించిన నెగటివ్ క్యారెక్టర్ (అజీజ్) కి, రణవిజయ్ కి మధ్య జరిగే పోరు చాలా భయంకరంగా ఉండబోతుందని సమాచారం.రెండో భాగంలో విలన్ ఎవరంటే..? మొదటి భాగం చివరిలో అజీజ్ అనే పాత్ర ప్లాస్టిక్ సర్జరీ ద్వారా రణబీర్ (రణవిజయ్) పోలికలను పొందుతుంది. అంటే రెండో భాగం -యానిమల్ పార్క్-లో రణబీర్ తనతో తనే యుద్ధం చేసుకోబోతున్నారు. ఈ సినిమాలో విలన్ -అజీజ్- పాత్ర రణవిజయ్ కంటే క్రూరంగా ఉంటుందని సమాచారం. --ఇది చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. హీరో, విలన్.. ఈ రెండు పాత్రలనూ నేనే పోషిస్తున్నాను-- అని రణబీర్ స్వయంగా వెల్లడించారు.మొదటి భాగంలో తండ్రి (అనిల్ కపూర్) కోసం రణవిజయ్ చేసిన విధ్వంసాన్ని చూశాం. రెండో భాగంలో ఈ బంధం ఇంకా ఏ మలుపులు తిరుగుతుందో, తండ్రిని కాపాడుకోవడానికి ఈ -డబుల్ రోల్- చిక్కుముడులను రణవిజయ్ ఎలా విప్పుతాడో అనేది కథలో కీలకం కానుంది.2027లో యానిమల్ పార్క్ షూటింగ్ మొదలవుతుంది. అయితే అంతకంటే ముందే రణబీర్ నుండి మరికొన్ని భారీ చిత్రాలు రానున్నాయి. వీటిలో భన్సాలీ -లవ్ అండ్ వార్- జూన్ 2026లో విడుదల కానుంది. అటుపై నితీష్‌తివారీతో -రామాయణం- 2026 దీపావళికి విడుదలవుతుంది.సీక్వెల్ ఆలస్యానికి కారణమేమిటి? అని ప్రశ్నిస్తే, సినిమా నాణ్యతను పెంచడానికే తప్ప వెనకడుగు వేయడం కాదని రణబీర్ స్పష్టం చేశారు. సందీప్ వంగా ఈ పాత్రల మనస్తత్వాలను ఇంకా లోతుగా విశ్లేషించాలని భావిస్తున్నారు. సందీప్ రెడ్డి వంగా సినిమాల్లో ఉండే ఆ -తీవ్రమైన డ్రామా-ను మళ్ళీ పెద్ద తెరపై చూడాలంటే 2027 వరకు ఓపిక పట్టాల్సిందే!



కావ్య థాపర్ టైమ్‌లెస్ ఎత్నిక్ స్టైల్‌తో ఆకట్టుకుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com